తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 4
సంచిక :
పేజీలు - 8
వెల- రూ 5 : 00
prajamantalu.com
# ప్రజా మంటలు
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

బుధవారం 31, మే 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## ఎస్ఐ పోస్టుల ఫలితాలు వెల్లడి




**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రిలిమ్స్, ఈవెంట్స్, తుది రాత పరీ క్షలు నిర్వహించారు. ఇక మిగిలింది ఫలితాల విడుదలే. ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ ఫలితాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ ప్రకటిం చింది. అయితే ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ తుది రాత పరీక్షల్లో 84.06 శాతం మంది అర్హత సాధించినట్లు టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ వెల్లడించింది.

ఈ పోస్టులకు సంబంధించి తుది రాత పరీక్ష రాసిన అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో నేటి రాత్రి నుంచి అందుబాటులో ఉంచనున్నారు.

# పరిశీలనలో మరో వందేభారత్..!

### సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య వందేభారత్

### పరిశీలనలో ఉన్నట్లు అధికారుల వెల్లడి



**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య త్వరలో మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే విశాఖ హైదరాబాద్‌తో పాటు తిరుపతి మధ్య రెండు వందేభారత్‌లు నడుస్తున్నాయి. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ గరిష్టంగా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో నడిచే అవకాశం ఉంది. ప్రస్తుతం, రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఒకటి సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య, మరొకటి సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడుస్తున్నాయి. ఇవి వారం పొడవునా 100 శాతం కంటే తక్కువ ఆక్యుపెన్సీ రేటుతో నడుస్తున్నాయి. డిమాండ్ కారణంగా ఈ రైళ్లలో రిజర్వేషన్లు నిండిపోతున్నాయని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) తెలిపింది. ఈ రెండు సర్వీసులు విజయవంతం కావడంతో వచ్చే కొద్ది నెలల్లో సికింద్రాబాద్ - నాగ్‌పూర్ మధ్య వందే భారత్ రైలును ప్రవేశపెట్టాలని భారతీయ రైల్వే యోచిస్తున్నట్లు తెలిస్తోంది. భారతీయ రైల్వే అధికారులతో కలిసి ఈ సేవలను ఎలాన్ చేస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్, నాగ్‌పూర్ మధ్య ఇప్పటికే దాదాపు 25 రైళ్లు నడుస్తున్నాయి. రెండు నగరాలు వాణిజ్య, వ్యాపార కేంద్రాలు. అయితే, అన్నీ ఎక్స్‌ప్రెస్

మిగతా... 2లో



## మిగులు విద్యుత్ దిశగా తెలంగాణ


- నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న ఘనత మనదే
- ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దేవులపల్లి ప్రభాకర్‌రావు

**జయశంకర్ భూపాలపల్లి, మే30(ప్రజా మంటలు):** ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల రాష్ట్రం విద్యుత్ కొరత నుంచి మిగులుకు చేరుకోబోతుందని టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దేవులపల్లి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రూ కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన పర్యవేక్షక ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్ విద్యుత్ ప్రగతి భవన్ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడే నాటికి కరెంట్ వినియోగం సగటున 1136 యూనిట్లు కాగా నేడు 2140 యూనిట్లకు చేరుకుందని వివరించారు. రాష్ట్రం ఏర్పడక ముందు రైతాంగం అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. పగలుమూడు గంటలు, రాత్రి మూడు గంటల కరెంట్ వల్ల రైతులు పొలాలవద్దే పడుకునేవారని , పాము, తేళ్ల కాటుకు, కరెంటు ప్రమాదాలకు లోనయ్యేవారని వివరించారు.

మిగతా... 2లో

# తడిసిన ధాన్యం...

- పలు జిల్లాల్లో ఈదురుగాలుల వర్షం
- భారీ వర్షంతో పలు జిల్లాల్లో కొట్టుకుపోయిన ధాన్యం
- ధాన్యం రక్షించుకునేందుకు రైతుల నానా తంటాలు
- ధాన్యం వెంటనే కొనాలని రైతుల ఆందోళన



**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి కురిసిన అకాల వర్షంతో మారోమారు అన్నదాతలు కుదేలయ్యారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం కారణంగా ఆరబోసిన ధాన్యం మరోమార కొట్టుకుపోయి భారీ నష్టం జరిగింది. కొట్టుకుపోయిన ధాన్యం కోసం రైతులు నానా కష్టాలు పడ్డారు. హనుమకొండ జిల్లా పరకాలలో ఈదురుగాలులు, ఉరుములు , మెరుపులతో వాన పడింది. వరంగల్ జిల్లా నర్సంపేటలో, ములుగు జిల్లాలోని వెంకటాపూర్, ములుగు, గోవిందరావుపేట, ఏటూరునాగారం, మంగపేట, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కారేపల్లి మండలంలో, ఇల్లందు మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తం వర్షం కురిసింది. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, ధర్మారం, ఎండపల్లిలో, కరీంనగర్‌లోని

మిగతా... 2లో



## బిఆర్ఎస్ పార్టీ ప్రజల కోసమే..!

- ప్రజల కోసమే పుట్టిన పార్టీ బిఆర్ఎస్
- వారి సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి
- దేశంలో చేయలేని పనులన్నీ చేసి చూపిన కెసిఆర్
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పోటీ అంటే బలైనట్లే
- మాక్లూరు ఆత్మీయ సమ్మేళనంలో కవిత
- బిజెపి పనైపోయిందన్న మంత్రి మల్లారెడ్డి

**నిజామాబాద్,మే30(ప్రజా మంటలు):** గత 22 ఏళ్లుగా ప్రజల కోసమే బిఆర్ఎస్ పనిచేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అనేక మంది కార్యకర్తలు పార్టీ కోసం జీవితాలను త్యాగం చేశారని కొనియాడారు. మక్లూర్‌లో నిర్వహించిన బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డితో కలిసి కవిత పాల్గొన్నారు. ఒకప్పుడు గులాబీ కండువా కప్పుకుంటే ఎగతాళి చేసేవారని. కానీ,

మిగతా... 2లో

## క్యూనెట్ పేరుతో మల్టీలెవల్ మార్కెటింగ్

- మోసం చేస్తున్న ప్రధాన నిందితుడు రాజేశ్ కన్నా
- అరెస్ట్ చేసినట్లు వెల్లడించిన సిపి సివి ఆనంద్

**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** దేశ వ్యాప్తంగా క్యూనెట్ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో మోసం చేస్తున్న ప్రధాన నిందితుడు రాజేష్ కన్నాను మొదటిసారి అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. పిరమిడ్ స్కీమ్ తో బోగస్ కంపెనీని ఏర్పాటు చేసి అమాయకులను టార్గెట్ చేసి, మోసాలు చేస్తున్నారని చెప్పారు.

మిగతా... 2లో



## ట్యాంక్‌బండ్‌ను పరిశుభ్రంగా ఉంచుదాం

- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడుదాం
- ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన కెటిఆర్



**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** హైదరాబాద్ మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, పట్టణాభి వృద్ధి, మున్సిపాలిటీ శాఖల మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలో ప్రభుత్వ యంత్రాంగం విరామం లేకుండా శ్రమిస్తోంది. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా హైదరా బాద్‌లోని పర్యాటక ప్రాంతాలను సుందరీకరిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పట్టణాభివృద్ధి, మున్సిపాలిటీ శాఖల మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్ ఖాతాలో ఓ వీడియోను విడుదల చేస్తూ.. సందేశమిచ్చారు. మహానగరానికి మణిహారం ట్యాంక్‌బండ్! శతాబ్దాల ఘన చరిత్రకు ప్రతీక ట్యాంక్‌బండ్! అందుకు తగ్గట్టే ట్యాంక్‌బండ్ సుందరీకరణను ప్రతిష్టాత్మకంగా తీసుకొని,

మిగతా... 2లో


## కాశ్మీర్‌లో లోయలో పడ్డ బస్సు

- ప్రమాదంలో పదిమంది మృత్యువాత



**శ్రీనగర్,మే30(ప్రజా మంటలు):** జమ్ముకశ్మీర్‌లోని జాజ్జర్ కోట్లీలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళ వారం ఉదయం అమృత్‌సర్ నుంచి కత్రా వెళ్తున్న బస్సు.. జమ్ము శ్రీనగర్ జాతీయ రహదారిపై జాజ్జర్ సమీపంలో పడిపోయింది. దీంతో ప్రమాదంలో పది మంది మరణించారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో 75 మంది ప్రయాణికులు ఉన్నారని చెప్పారు. రాజస్థాన్‌లోని ఝున్‌ఝునులో సోమవారం సాయంత్రం ఓ ట్రాక్టర్ అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎనిమిది అక్కడికక్కడే మరణించారు. మరో 26 మంది గాయపడ్డారు. మృతుల్లో ఆరుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారని అధికారులు తెలిపారు. మానా మాతా ఆలయంలో పూజాధికాలు పూజించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

### ప్రజానాడి




## ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో శాంతిభద్రతలు భేష్

- పోలీసులపై ప్రజల్లో పెరిగిన నమ్మకం
- వనపర్తిలో ఎస్పీ కార్యాలయ ప్రారంభంలో హోంమంత్రి

**వనపర్తి,మే30(ప్రజా మంటలు):** ప్రభుత్వం అందజేస్తున్న సహకారం వల్ల రాష్ట్ర పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరిగిందని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్ వల్ల శాంతి భద్రతలు మెరుగ్గా ఉన్నాయని స్పష్టం చేశారు.
మంగళవారం వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

మిగతా... 2లో



## లోక్‌సభ సీట్ల పెంపులో లబ్దిపొందుతున్న ఉత్తరాది రాష్ట్రాలు

- డి లిమిటేషన్‌లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం
- ఆయా రాష్ట్రాలు తమ వాణిని వినిపించాల్సిందే
- ట్విట్టర్ వేదికగా మంత్రి కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** 2026వ సంవత్సరం తర్వాత జనాభా ప్రతిపాదికన జరుగనున్న లోక్‌సభ స్థానాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మంత్రి కె.తారక రామారావు

మిగతా... 2లో



# బిఆర్ఎస్ పార్టీ ప్రజల కోసమే..!

**మొదటిపేజీ తరువాయి..**

ఇప్పుడు గులాబీ కండువా కప్పుకున్నందుకు గర్వపడుతున్నామన్నారు. కార్యకర్తల త్యాగఫలమే కాళేశ్వరం జలాలు అని కవిత పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం బీఆర్ఎస్ కార్యకర్తల లక్ష్యం, కర్తవ్యం అని కవిత స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటి వరకు ఎవ్వరూ చేయలేనన్ని మంచి పనులను సీఎం కేసీఆర్ చేసి చూపించారని, జరిగిన అభివృద్ధిని, అందిస్తున్న పథకాల గురించి ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని



కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గత ఎన్నికల్లో కంటే అధిక మెజారిటీతో వచ్చే ఎన్నికల్లో గెలుస్తారన్న విశ్వాసం ఉందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో జీవన్ రెడ్డి మీద ఎవరైనా పోటీ చేయాలనుకుంటే మైసమ్మ ముంగట మేకపోతును కట్టేసినట్టే అవుతుందని తెలియజేశారు. కాబట్టి ఇతర పార్టీల నేతలు గెలిచే అవకాశం లేనందుకు ఆశలు వదిలేసుకుంటే మంచిదని సూచించారు. ఒకప్పుడు ఇదేమి పార్టీ అని అవహేళన చేశారని, కానీ ఇప్పుడు అదే గులాబీ పార్టీ ఇంటికి మూడు పథకాలు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. పది మందికి సాయం చేశామంటే ఆ రోజు రాజకీయ నాయకులకు ప్రశాంతంగా నిద్రపడుతుందన్నారు. 'మీరు చేసిన త్యాగం ఇవాళ తెలంగాణలో ఇస్తున్నటువంటి ప్రతీ పథకం. ఇవాళ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు



చిందించినటువంటి స్వేదం? చెరువుల్లో కనిపిస్తున్న మంచినీటి చుక్కలు. బీఆర్ఎస్ కార్యకర్తల త్యాగం ? ఇవాళ కాళేశ్వరం ప్రాజెక్టు రూపంలో తెలంగాణ మొత్తానికి నీటి కుండలాగా తరతరలాకు ఆదుకునే ప్రాజెక్టు. మనది ఉట్టి రాజకీయ పార్టీ కాదు. ఎంతో కష్టంతో, కోపంతో, ఆవేదనతో , ప్రేమతో పుట్టుకొచ్చిన పార్టీ. ప్రజలను బాగు చేయాలని భావించిన పార్టీ మనది ' అని కార్యకర్తలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గత 10 ఏళ్లలో దేశంలో ఎవ్వరూ చేయనన్ని మంచి పనులు బీఆర్ఎస్ పార్టీ చేసి చూపెట్టిందని స్పష్టం చేశారు. మరింత బాధ్యతగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. మనకు ఇతర రాజకీయ ఆలోచనలు లేవని, ప్రజలకు మంచి చేయాలన్నదే ప్రధాన ఆలోచన అని స్పష్టం చేశారు. తెలంగాణకు బాగుపడాలని కోరుకునేవాళ్లమని కవిత చెప్పారు.రెండు దశాబ్దాల నుంచి ప్రజల్లో ఉన్న నాయకులు ఈ మండలంలో ఉన్నారని కవిత గుర్తు చేశారు. అనేక మంది కార్యకర్తలు, నాయకులు గులాబీ కండువాకు అంకితమయ్యారని కొనియాడారు. తమ పార్టీ విస్తరిస్తోందని, ప్రజలకు మంచి జరగాలన్నది మొదటి ఉద్దేశమని, మనకు పదవులు రావడం అన్నది రెండో ఉద్దేశమని అన్నారు. సీఎం కేసీఆర్ లక్ష్యాన్ని, తెలంగాణ ప్రజల ఆశయాలను, అమరవీరుల త్యాగాలను, జయశంకర్ సార్ స్ఫూర్తిని తీసుకకొని ముందుకెళ్తున్న పార్టీ బీఆర్ఎస్ అని, ఇటువంటి పార్టీలో ప్రతీ ఒక్కరికి అవకాశాలు వస్తాయని, మంచి పదవులు వస్తాయని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు.

మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. కర్ణాటక ఎన్నికల్లో బిజెపి పని అయిపోయిందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంతో ఉన్నారన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం మోడల్‌గా మారిందన్నారు.లక్షా 33 వేల మంది బీడీ కార్మికులకు నిజామాబాద్ జిల్లాలో పెన్షన్ అందుతోందని, కాబట్టి ప్రత్యేకించి బీడీ కార్మికుల కోసం ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లా రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆస్పత్రిని నిర్మిస్తే కామారెడ్డి ప్రాంతంలో ఉన్న కార్మికులకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. భవన నిర్మాణ కార్మికులు నిజామాబాద్ లో పెద్ద సంఖ్యలో ఉంటారని, వారికి బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మిగులు విద్యుత్ దిశగా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి..**

అప్పటి పరిస్థితి నేడు లేదని, అందరికీ నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో హైదరాబాద్‌లో అందిస్తున్న మాదిరిగా నాణ్యమైన విద్యుత్‌ను మారుమూల ప్రాంతాలకు కూడా ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి కరెంట్ జనరేషన్, డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌మిషన్లపై రూ. 97,500 కోట్లు పెట్టుబడి పెట్టిందని తెలిపారు. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్రూషన్ నెట్‌వర్క్ కోసం 40 వేల కోట్లు వెచ్చించడడం వల్ల నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. భూపాలపల్లి సెకండ్ స్టేజ్ కింద 600 మెగావాట్ల ప్రాజెక్టును చేపట్టి ఏడాదిలోపు పూర్తి చేసి సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చేనాటికి 7778 మెగావాట్ల కెపాసిటీ ఉండగా నేడు 18,565 మెగావాట్ల కెపాసిటీ వరకు పెంచామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు(ఐజ్జీ÷బఠలిజీసజీప)కు అవసరమయ్యే విద్యుత్ ఇచ్చే స్థితిలో ఉన్నామని తెలిపారు. వీటితో పాటు పాలమూరు,రంగారెడ్డి ఎత్తిపోతలకు అవసరమయ్యే 6500 మెగావాట్ల విద్యుత్ అవసరముంటుందని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ దూరదృష్టితో మిర్యాల గూడ దామరచర్ల వద్ద 4వేల మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉత్పత్తికి రూ. 34 వేల కోట్లతో చేపట్టామని త్వరలో దాన్నికూడ ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎన్పీడీసీఎల్ సీఎండి అన్నమనేని గోపాల్ రావు, జెన్కో,ట్రాన్స్‌కో డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో సీఎండీ మొక్కను నాటారు .

# తడిసిన ధాన్యం..

**మొదటిపేజీ తరువాయి..**

శంకరపట్నం, వేములవాడ, రుద్రంగి, చందుర్తి, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో భారీ వాన పడింది. అదేవిధంగా మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, గాల్ల, బయ్యారం, కేసముద్రం, నెల్లికుదురు మండలాల్లో ఈదురుగాలులతోకూడిన వాన కురిసింది. ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, భువనగిరి, చిట్యాల, నార్కట్‌పల్లి, రామన్నపేటలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురువడంతో వర్షంతో పలుచోట్ల రోడ్లు జలమయమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలుల ధాటికి రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. రోహిణి కార్తె కావడంతో ఎండ, వడగాల్పుల తీవ్రత ఉన్నప్పటికీ ఉపరితల ఆవర్తన ద్రోణి కొనసాగుతున్నదని, దీంతో రాబోయే 3 రోజుల పాటు



వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు భద్రాద్రి, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్లు కురిసే అవకాశం ఉండగా, ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. బుధవారం నుంచి శనివారం వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. ఇదిలావుంటే తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరారు. జగిత్యాల జిల్లాలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ హైవేపై రైతులు ఆందోళనకు దిగారు. వెల్గటూర్ మండలం పాశీగామ రైతులు రోడ్డు పై బస్తాలు వేసి మొలకెత్తిన ధాన్యం పోసి నిరసన తెలిపారు.

రోడ్డుపై బైఠాయించడంతో కరీంనగర్ మంచిర్యాల హైవేపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని రెండు నెలలు అవుతున్నా ఎక్కడి ధాన్యం అక్కడే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు రైతులు. గత మూడు రోజుల క్రితమే తిమ్మ పూర్ సొసైటీ ముందు నిరసన తెలిపిన రైతులు మళ్ళీ ఇవాళ రోడ్డు పై బైఠాయించారు. ఇథనాల్ ప్రాజెక్టు రద్దు కోసం ఆందోళనలు చేసినందుకే కక్ష కట్టి ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ ఎమ్మార్వోతో రైతులు వాగ్వాదానికి దిగారు.

# లోక్‌సభ సీట్ల పెంపులో లబ్దిపొందుతున్న ఉత్తరాది రాష్ట్రాలు

**మొదటిపేజీ తరువాయి..**

అన్నారు. అధిక జనాభాతో సతమతమవుతున్న దేశాన్ని కాపాడు కునేందుకు జనాభా నియంత్రణ పద్ధతులు పాటించాలని దశాబ్దాల నుంచి కేంద్రం చెబుతున్న మాటలను, విధానాలను నమ్మి ప్రగతిశీల విధానాలతో జనాభా నియంత్రణ చేసిన దక్షిణాది రాష్ట్రాలు ఈరోజు తీవ్ర అన్యాయానికి లోనయ్యే అవకాశం ఉందన్నారు. ప్రగతిశీల విధానాలతో ముందుకు పోతున్న దక్షిణాది రాష్ట్రాలు ఈ నూతన డిలిమిటేషన్ వల్ల తక్కువ లోక్‌సభ స్థానాలు పొందడం అన్యాయం, బాధాకరమని ట్విట్టర్ వేదికగా తెలిపారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తులను పట్టించుకోకుండా జనాభా నియంత్రణ చేయని రాష్ట్రాలు, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్ల పెంపులో లబ్దిపొందుతు న్నాయని.. ఇది దురదృష్టకరమన్నారు. జనాభాను నియంత్రించిన కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు తమ ప్రగతిశీల విధానాలకు తీవ్రంగా శిక్షించబడుతున్నాయని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. కేవలం జనాభా నియంత్రణ మాత్రమే కాకుండా అన్ని రకాల మానవాభివృద్ధి సూచీల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని చెప్పారు. కేవలం 18 శాతం జనాభా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు 35 శాతం జాతీయ స్థూల జాతీయోత్పత్తికి నిధులు అందిస్తున్నాయని తెలిపారు. జాతీయ ఆర్థిక అభివృద్ధికి, దేశ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అసంబద్ధమైన లోక్‌సభ డిలిమిటేషన్ విధానం వల్ల భవిష్యత్తులో తమ ప్రాధాన్యత కోల్పోరాదని చెప్పారు. తమ ప్రగతిశీల విధానాలకు లబ్దిపొందాల్సిన చోట తీవ్రమైన అన్యాయానికి గురవుతున్న దక్షిణాది రాష్ట్రాలు వాణిని వినిపించాల్సిన అవసరం ఉన్నదని, ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న అన్యాయంపైన నాయకులు, ప్రజలు గళమెత్తాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు.

# పరిశీలనలో మరో వందేభారత్..!

**మొదటిపేజీ తరువాయి..**

రైళ్లు, సూపర్‌ఫాస్ట్ రైళ్లు కాదు. రెండు నగరాల మధ్య చాలా వాణిజ్యం జరుగుతుంది. సాధారణ ప్యాసింజర్ రైళ్ల ప్రయాణ సమయం సుమారు 10 గంటలు. అదే వందే భారత్ రైలు ఆ ప్రయాణ సమయాన్ని 6.30 గంటలకు తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. సికింద్రాబాద్, నాగ్‌పూర్ మధ్య దూరం దాదాపు 581 కి.మీ. సాధారణంగా ఈ దూరాన్ని అధిగమించడానికి 10 గంటలు పడుతుంది. ఇప్పుడు భారతీయ రైల్వే కొత్త వందే భారత్ రైలును ప్రవేశపెట్టడం ద్వారా సమయాన్ని 10 గంటల నుండి 6.30 గంటలకు తగ్గించడానికి ప్రయత్నిస్తోంది. సికింద్రాబాద్ నుంచి కాజీపేట, రామగుండం, సిర్పూర్ ఖగజ్ నగర్, బలార్షా మీదుగా ఈ రైలును నడపాలని భావిస్తున్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నాగ్‌పూర్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుని తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు నాగ్‌పూర్ చేరుకునే అవకాశం ఉంది. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# ట్యాంక్‌బండ్‌ను పరిశుభ్రంగా ఉంచుదాం

**మొదటిపేజీ తరువాయి..**

ఈ విశిష్ట నిర్మాణానికి మరిన్ని మెరుగులు అద్ది ట్యాంక్‌బండ్‌ను అత్యంత అందంగా తీర్చిదిద్దింది తెలంగాణ ప్రభుత్వం అని కేటీఆర్ పేర్కొన్నారు. నగర ప్రజలకు, పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందిస్తూ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్న ట్యాంక్‌బండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడటం మనందరి బాధ్యత అని సూచించారు. మనం నివసించే ఇంటిలాగానే మనకు గర్వకారణం అయిన పర్యాటక ప్రదేశాల్లో కూడా పరిశుభ్రతను పాటించాలని ప్రజలందరికి విజ్ఞప్తి చేస్తున్నాను అని కేటీఆర్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# క్యూనెట్ పేరుతో మల్టీలెవల్ మార్కెటింగ్

**మొదటిపేజీ తరువాయి..**

ఇటీవల ప్రమాదానికి గురైన సికింద్రాబాద్ స్వప్న లోక్ కాంప్లెక్స్ లోనూ బోగస్ కంపెనీ నడుస్తోందని తెలిపారు. రూ.2 లక్షల పెట్టుబడి పెడితే ప్రతి నెల రూ.20 వేల నుండి 60 వేల వరకు ఆదాయం వస్తుందని నమ్మిస్తున్నారని, మొదట్లో కరెక్టుగానే డబ్బులు ఇచ్చి.. ఆ తర్వాత ఎస్కేప్ అవుతున్నారని చెప్పారు. గొలుసు కట్టు పద్ధతిలో అమాయకులను లక్ష్యంగా చేసుకుని..మోసం చేస్తున్నారని వెల్లడించారు. క్యూ నెట్ మల్టీలెవల్ మార్కెటింగ్ లో దాదాపు159 మంది బాధితులు రూ.3 కోట్ల వరకు డబ్బు పోగొట్టుకున్నారని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

క్యూ నెట్ స్కామ్ పై సీసీఎస్, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేస్తోందన్నారు. క్యూనెట్ నడిపిస్తున్న రాజేష్ కన్నాను అరెస్ట్ చేశామని, అతడికి సంబంధించిన 35 బ్యాంకు అకౌంట్లు, రూ.54 కోట్ల నగదును ఫ్రీజ్ చేశామని తెలిపారు. సూపర్ మార్కెట్ స్కీం ద్వారా మోసపోయిన 44 మంది బాధితులను గుర్తించామన్నారు. రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే ప్రతి నెలా లక్ష రూపాయలు వస్తుందని చెప్పి మోసం చేస్తున్నారని వెల్లడించారు. మొదట్లో రెండు, మూడు నెలల పాటు సరిగానే అమౌంట్ ఇచ్చి.. ఆ తర్వాత ఉడాయిస్తున్నారని చెప్పారు.

మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో దేశంలో వెయ్యి కోట్ల బిజినెస్ చేసినట్లు తాము గుర్తించామని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఆయుర్వేద మందుల పేరుతో ప్రొడక్స్ ఇచ్చి కూడా చాలా రకాలుగా మోసాలు చేస్తున్నారని చెప్పారు. స్వప్నలోక్ కాంప్లెక్స్ లో జరిగిన అగ్నిప్రమాదంలో చనిపోయిన బాధితులు కూడా క్యూనెట్ లో డబ్బులు పెట్టి మోసపోయారని చెప్పారు. ఇలాంటి మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలపై ప్రజలందరూ మరింత అప్రమత్తంగా ఉండాలని సీవీ ఆనంద్ హెచ్చరించారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో శాంతిభద్రతలు భేష్

**మొదటిపేజీ తరువాయి..**

ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు 64 శాతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దేశంలో రాష్ట్రం నంబర్‌వన్‌లో ఉందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ వల్ల తెలంగాణ అభివృద్ధి దేశానికి ఆదర్శం గా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడితే ప్రజలు నష్టపోతారని, పది జిల్లాలో 9 జిల్లాలు వెనుకబడి పోతాయని కొంతమంది తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. కరెంటు ఉండదు. పరిశ్రమలు రావంటూ ఎద్దేవా చేశారని ఆయన అన్నారు. కేసీఆర్ పట్టుదలతో అన్ని వర్గాలను ఏకం చేసి శాంతియుతంగా రాష్ట్రాన్ని సాధించిన తరువాత ఏర్పడ్డ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. దీనికి కారణం సీఎం కేసీఆర్ ముందస్తు ఆలోచనే కారణమని అన్నారు. మిషన్ భగీరథ వల్ల ఇంటింటికి సురక్షిత మంచినీరు అందుతుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమర్, కలెక్టర్, ఎస్పీ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ధూమపానం వద్దు.. జీవితమే ముద్దు..

**"ఆనందాన్ని ఎవరు మాత్రం కోరుకూరు కానీ ఎంత మూల్యానికి".**
**"నా పేరు ముఖేష్ బహుశా మీరు మళ్ళీ నన్ను చూడకపోవచ్చు".**
**"వైద్యం కొరకు మా అమ్మ రెండు బంగారు గాజులు అమ్ముకోవడం జరిగింది".**
**ఇత్యాది సందేశాలు తరుచుగా మనం రోజా వారీగా చూస్తున్న ప్రాయోజిత కార్యక్రమాలు గా ఉన్నాయి.**

వీటి వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం ఒకటే అది పొగాకు వినియోగం నేటికీ ప్రపంచ ప్రజారోగ్యానికి సంబంధించిన వరకు అతి పెద్ద మహమ్మారి అని తెలియజెపుతూ వాటి వినియోగం తగ్గించడానికి చేసే కృషి.

పొగాకు వాడకం కేవలం మన దేశ ప్రజా సమస్యే కాదు ప్రపంచ దేశాలలో కూడా పొంచి ఉన్న పెను ప్రమాదం.

సిగరేట్లో ఏముంది? పొగాకే కదా! పైగా ఫిల్టర్ సిగరేట్! త్రాగితే ఏమవుతుంది? ... హాయిగా... గాల్లో తేలిపోయినట్లు ఉంటుంది అని పొగచుట్ట ప్రియులు తేలిగ్గా తీసిపారేస్తుంటారు. కానీ డబ్లు.హెచ్.ఒ గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగించే వారి సంఖ్య 26.7కోట్ల మంది అందులో ఏటా 80లక్షల మంది బలి అవుతున్నారు.

అందులో 15% మంది అనగా 12లక్షల మంది పొగాకు పీల్చడం ద్వారా మరణిస్తున్నారు. 2018 డబ్లు.హెచ్.ఒ గాట్స్ (గ్లోబల్ అడల్ట్ టొబాకో సర్వే రిపోర్ట్, వయసు15ం) సర్వే ప్రకారం మన భారత దేశంలో ఏటా 10లక్షల మంది మరణిస్తున్నారు. ఈ మరణాల సంఖ్య గణనీయమైనది.

### చారిత్రక నేపథ్యం :

ఈ మహమ్మారి ని నియంత్రించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 వ సం. లోనే తన భాగస్వామ్య దేశాలతో కూడి పొగాకు రహిత సమాజమును ఏర్పర్చాలని ఉద్ఘాటిస్తు ప్రతీకగా ప్రతీ సం. మే 31 వ రోజును ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం గా పరిగణించారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారకంగా సూత్రీకరించిన 11 ప్రపంచ ప్రజా ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాల లో డబ్లుఎన్టిడి (వరల్డ్ నో టొబాకో డే) కూడా ఒక ముఖ్యమైన కార్యక్రమం.

పొగాకు వినియోగం కట్టడి లో భాగంగా మన భారత దేశ కేంద్ర ప్రభుత్వం ఒక చట్టాన్ని ఏర్పరిచి అమలులోకి తీసుకరావడం జరిగింది అది కొట్పా 2003. (ద సిగరెట్స్ & అదర్ టొబాకో ప్రొడక్ట్స్ యాక్ట్ 2003)[ప్రొహిబిషన్ ఆఫ్ అడ్వర్టైజ్మెంట్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ట్రేడ్%రి. %ఈ చట్టం ప్రకారం దేశంలోని వ్యక్తి, సంస్థ లు సిగరెట్, సంబంధిత ఉత్పత్తులు, ప్రచారం, అమ్మకం, కొనుగోలు,వాడకం కి సంబంధించి నియంత్రణ పద్దతులను ఏర్పరచడం జరిగింది.

### పొగాకు వలన అనర్థాలు :

గుండె జబ్బులతో చనిపోయే ప్రతి 5 మందిలో ఒకరు ధూమపాన ప్రియులే.

భారతదేశంలోని నోటి క్యాన్సర్ బాధితుల్లో మూడింట ఒకవంతు పొగధీరులే.

మనదేశంలో 40% క్యాన్సర్ జబ్బులకు ధూమపానమే ప్రధానకారణం. క్రానిక్ అబ్బ్రక్టివ్ పలమనరీ డిసీజ్ (సిఒపిడి)గా చెప్పబడే క్రానిక్ బ్రాంకైటీస్, ఎంఫైసిమా అనే వ్యాధులకు కారణం కూడా ధూమపానమే.

**మే-31 ప్రపంచ వ్యతిరేక పొగాకు దినోత్సవం**

ప్రస్తుతం కోవిడ్-19 వ్యాప్తి చెందుతున్న సమయంలో పొగాకు వినియోగం కూడా కరోనా వ్యాప్తికి మార్గం కాగలదు.

సిగరెట్, బీడీ, ఖైనీ, పాన్ మసాలా, జర్దా తదితర రకాలుగా పొగాకు తాగేవారు నోటి వద్దకు చేతిని, వ్రేళ్ళను తీసుకురావడం మరియు




పొగాకు పీల్చడం వలన ఊపిరి తిత్తుల కు అధిక శ్రమ పెరిగి తద్వారా ఇన్ఫెక్షన్ కలిగి రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉమ్మి వలన ఏర్పడే మలినం, తుంపిరిల వలన కూడా కరోనా వ్యాప్తికి అధిక అవకాశాలు ఉంటాయి.

### పొగాకు వినియోగ మరణాల తగ్గుదల, పరిష్కార మార్గాలు:

చట్టాలు ఎన్ని ఏర్పరిచినప్పటికిని అది మరణాల తగ్గుదలలో అంతగా ప్రభావితం చూపలేకపోవడం ఒక విధంగా భాద కలిగించే విషయమే !!! సమాజంలో ఈ విషయంగా ఎన్ని సవాళ్లు ఉన్నప్పటికీ దానికి సంబందించిన పరిష్కార మార్గాలు కూడా లేకపోలేదు.

2. ప్రభుత్వ పరంగా, సంస్థల పరంగా ఇంకా MPOWER చేయాల్సిన అవసరం ఉంది.

M- మానిటర్.
P- ప్రొటెక్ట్.
O- ఆఫర్.
W- వార్న్.
E- ఎన్ఫోర్స్.
R- రైజ్.

వివిధ నియంత్రణ పద్ధతుల ద్వారా నిత్య పర్యవేక్షణ చేస్తూ పొగాకు వినియోగం పై విరివిగా అవగాహన కల్పిస్తూ వ్యతిరేకతను ప్రోత్సహిస్తూ కటిన శిక్షలు, పన్నులు పెంచాలి.

2. వినియోగ దారుల కుటుంబాలకు కనీస ఆరోగ్య భీమా భద్రత కల్పించడం అంటే మన దేశంలో ఒక సం. లో సిగరెట్టు లేదా పొగాకు సంబంధిత రంగం ద్వారా ఏర్పడే ఆదాయం విలువ రూ. 11.79లక్షల కోట్లు అనగా ఒక రోజుకు సగటున కూడే ఆదాయం విలువ రూ. 320కోట్లు అందునా సం. లో రూ. 43వేల కోట్లు ప్రభుత్వానికి టాక్స్ రూపం లో ఆదాయం(ద టొబాకో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా రిపోర్ట్ ప్రకారం) . ఆ టాక్స్ మొత్తంలో కుదిరినంతగా పొగాకు బాధితులకు సహాయం చేకూర్చడం.

3. పొగాకు వినియోగం వలన సంభవిస్తున్న మరణాల పై సంఘం లో ఉన్న ఉత్తమ, ఉన్నత, ప్రజాదరణ పొందిన వ్యక్తుల, కార్యక్రమాల ద్వారా విరివిగా అవగాహన ఏర్పరచడం.

ఇక్కడ చండీగఢ్ కి చెందిన హేమంత్ గోస్వామి గురించి చెప్పుకోవడం గుర్తుంచుకోవాల్సిన విషయం. వారికి పొగాకు వ్యతిరేక ఉద్యమాల కృషి కి గాను గ్లోబల్ స్మోక్ ఫ్రీ పార్ట్‌నర్ షిప్ 2008 అవార్డ్ దక్కింది. ఈయన కృషి ఫలితంగానే 2009 లో పొగాకు ఉత్పత్తుల ప్యాకేజీ పై 40% చిత్ర రూపంలో హెచ్చరికలు ఉంచాలని మన దేశ ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

4. పొగాకు వ్యతిరేక దినోత్సవం రోజు అయినా కనీసం ఏ రకమైన పొగాకు, సంబంధిత ఉత్పత్తుల వినియోగం, సరఫరా, పంపిణీ జరపకుండా స్వీయ నియంత్రణ పాటించడం ఒక గొప్ప మానవత్వ విలువలతో కూడిన కార్యక్రమం.

స్వీయ నియంత్రణ అనేదే ఏకైక పరిష్కార మార్గం గా భావించి చేయి చేయి కలిపి కార్యోన్ముఖులు అయి ముందుకు వెళ్ళడం ద్వారా మన వంతుగా బావి తరాలకు అలాగే ప్రస్తుత కాల మానవాళికి ఎంతో ప్రయోజన కారిగా ఉంటూ జీవనమునకు సార్థకత ను చేకూర్చుకునే అతి గొప్ప అవకాశం ఉంది.

మన దేశంలో మానవాళి ప్రాణాలకు సంబంధించి ఈ పొగాకు వ్యతిరేక విషయం ఎంత వరకు ముఖ్యమైన ఆచరణీయ విషయం అంటే ఏటా రోడ్డు ప్రమాదాల వల్ల 1.5లక్షల మంది మరణిస్తున్నారు అంటే పొగాకు వల్ల మరణించే వారి సంఖ్య కన్నా 90% తక్కువ.

కొవిడ్-19 వ్యాప్తి వల్ల సుమారు 3లక్షల మంది మరణించారు అంటే పొగాకు వల్ల మరణించే వారి సంఖ్య కన్నా 60% తక్కువ.

జీవితాలు గాల్లో కలిసిపోయేలా చేజేతులా రా నోరారా చేసుకోరాదు.

ఘాటుకు అలవాటుపడిన వారికి ఘాటుగా అయినా చెప్పి దమ్ముకొట్టడం మాన్పిద్దాం. దమ్ముకొట్టనందుకు ధన్యవాదాలు తెలపుదాము.

ఒళ్ళు, ఇల్లు గుల్ల తప్ప మరొక ప్రయోజనం లేదనే వాస్తవాన్ని అందరికి చాటి చెబుతాం.

అందరం కలిసి పొగాకు పొగలేని భవిష్యత్తు ను భావితరాలకు అందిద్దాం.
ఇదే మన అందరి తక్షణ కర్తవ్యం.
"ఆష్ ట్రేలో గులాబీ పువ్వు" –
ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ గుర్తు.



– సిరిసిల్ల రాజా విక్రాంత్ శర్మ.
9963349493.



## గోదావరి హారతి పోస్టర్ల ఆవిష్కరణ

**నిజామాబాద్ మే 30 (ప్రజామంటలు):** జూన్ 3న నిజామాబాద్ జిల్లా కందకుర్తిలో ప్రారంభం కానున్న గోదావరి హారతి ఉత్సవాల పోస్టర్ ను మంగళవారం బీర్పూర్ లో గోదావరి హారతి జగిత్యాల జిల్లా యాత్రా ప్రముఖ్ నరేంద్ర పన్నీరు ఆవిష్కరించారు. కందకుర్తిలో ప్రారంభమై బాసర, మోర్తాడు, గుమ్మిరాల, ధర్మపురి, కాళేశ్వరం, నాగారం మీదుగా భద్రాచలం వరకు ఈ యాత్ర కొనసాగుతుందని నరేంద్ర తెలిపారు. యాత్ర జూన్ 5న సాయంత్రం నాలుగు గంటలకు ధర్మపురి చేరుకుంటుంది. గోదావరి నదీ జలాలు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై నదీ తీరం ప్రాంతాలలో చర్చా గోష్టులు నిర్వహించి ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన వలసిందిగా కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో గోదావరి హారతి జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, బిజెపి బీర్పూర్ మండల అధ్యక్షులు మేడ జనార్ధన్, బిజెపి జిల్లా నాయకులు భోగ శ్రావణి, పడాల తిరుపతి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అప్పల జలంధర్, ప్రముఖ గల్ఫ్ ఎన్నారై ఉట్నూరి రవి, కట్ట నవీన్, దీటి వెంకటేష్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

### వై.హేచ్.పి.ఎస్. జిల్లా ఉపాధ్యక్షులుగా కొండయ్య యాదవ్

**జగిత్యాల మే 30 (ప్రజామంటలు):** యాదవ హక్కుల పోరాట సమితి యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా బత్తుల కొండయ్య యాదవ్ ను నియమిస్తూ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కొక్కెర మల్లేష్ యాదవ్ నియమించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో జగిత్యాల జిల్లాలో యాదవ హక్కుల పోరాట సమితి విస్తరణలో భాగంగా యువజన విభాగ విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టామని మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు.



అందులో భాగంగా యువజన విభాగంలో జిల్లా ఉపాధ్యక్షులుగా కొండయ్య యాదవ్‌ను నియమించామని యాదవ హక్కుల పోరాటం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని మల్లేష్ యాదవ్ సూచించారు. తన నియామకానికి కృషిచేసిన ప్రతిఒక్కరికి కొండయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అద్యక్షుడు మేకల రాములు యాదవ్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు దేవేందర్ యాదవ్, జగిత్యాల జిల్లా అద్యక్షుడు బల్కం మలేష్ యాదవ్, వేములవాడ శ్రీనివాస్ యాదవ్, రాములు యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



**గొల్లపల్లి మండలం మల్లన్నపేట్ గ్రామములో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలకు, బోనాల జాతర కార్యక్రమానికి హాజరై తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు డా. గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్. పాల్గొన్న గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు గంగాధర్ గౌడ్, నరేష్, శోభన్ గౌడ్ తదితరులు**

## ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలని సీఎంకు విజ్ఞప్తి

**సికింద్రాబాద్ మే 30 (ప్రజామంటలు):** రాష్ట్ర జనాభా లో అధిక శాతం కలిగి ఉన్న ముదిరాజ్ లు అనేక రంగాల్లో దశాబ్దాల తరబడిగా వెనకబడి ఉన్నారని ఆలిండియా ముదిరాజ్ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా యావత్ ముదిరాజ్ జాతి డిమాండ్ చేస్తున్నట్లుగా ముదిరాజ్ కమ్యూనిటీని బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్ కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ముదిరాజ్ ల డిమాండ్లతో కూడిన ఒక



వినతిపత్రాన్ని వెంకటేశ్వర్లు సీఎం కు పంపించారు. రిజర్వేషన్లు లేక ముదిరాజ్ బిడ్డలు ఉన్నత చదువులు చదవడానికి ఇబ్బందులు పడుతున్నారని, ముదిరాజ్ ల్లో కూడ ఆర్థికంగా వెనకబడిన వారు లక్షల్లో ఉన్నారని గుర్తు చేశారు. ఇప్పటికైన క్షేత్రస్థాయిలో ముదిరాజ్ లు పడుతున్న కష్టాలను పరిగణలోనికి తీసుకొని వెంటనే బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్ లోకి ముదిరాజ్ లను మార్చుతూ, సీఎం జీవో విడుదల చేయాలని వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.



## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాలు జరిగే ప్రదేశాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్

**జగిత్యాల మే 30 (ప్రజా మంటలు):** జూన్ 4వ తేదీ – ఆదివారం–సురక్షా దినోత్సవం సందర్భంగా కొత్త బస్టాండ్ నుండి టవర్ సర్కిల్, చౌరస్తా, మీదుగా జరిగే పెట్రోలింగ్ కార్స్, బ్లూ కోట్స్ , వెహికిల్స్ తో ర్యాలీ ప్రదేశాలను, మున్సిపల్ పార్కు దగ్గర ఏర్పాటు చేసి సభ ప్రాంగణం మరియు అదే రోజు సాయంత్రం సుమంగళి గార్డెన్ లో జరిగే కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. జూన్ 12వ తేదీ – సోమవారం – తెలంగాణ రన్ మినీ స్టేడియంలో నుండి పార్కు వరకు జరిగే కార్యక్రమంనికి సంబంధించి చేయవలసిన ఏర్పాట్లును పరిశీలించారు. ఆదేవిదంగా తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 2వ తేదీన అమర వీరుల స్మారక స్థూపం పార్క్ ప్రారంభించనున్న దృష్ట్యా భద్రతాపరమైన ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇతర శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట డిఎస్పి ప్రకాష్, టౌన్ ఇన్స్పెక్టర్ రామచంద్రరావు, రూరల్ సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఆర్ఐ లు వామనమూర్తి, నవీన్, ట్రాఫిక్ ఎస్.ఐ. రామ్ పాల్గొన్నారు.

## తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ కలర్ బెల్ట్స్ ప్రధానోత్సవం....

**కోరుట్ల టౌన్ మే 30 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణం లోని ఐలాపూర్ రోడ్డు లోని పెద్దమ్మ టెంపుల్ దగ్గర కోరుట్ల తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం తైక్వాండో స్టూడెంట్స్ కి కలర్ బెల్ట్ అప్ గ్రేడింగ్ టెస్ట్ మరియు బెల్టులు, సర్టిఫికెట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ఎగ్జామినర్ గా తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి సంతోష్ కుమార్ హాజరై పిల్లల యొక్క శక్తి సామర్థ్యాలు ప్రతిభా పాటవాలను పరీక్షించి అందులో ఉత్తమ ప్రతిభా పాటవాలు అత్యంత నైపుణ్యం చూపించిన పిల్లలకి బెల్టులు మరియు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర శేఖర్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి టీవీ5 రిపోర్టర్ మన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీ రాజం, ఇల్లుటపు నర్సయ్య లు విచ్చేసి విద్యార్థిని విద్యార్థులకు బెల్టులు మరియు సర్టిఫికెట్లు వారి చేతుల మీదుగా అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ కోల గంగారావు మాస్టర్ మాట్లాడుతూ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అనునది ఒక ప్రత్యేకమైన యుద్ధ విద్య అంతే కాకుండా ఈ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకొని అందులో సాధించే సర్టిఫికెట్స్ ద్వారా భవిష్యత్తులో



ఉన్నత విద్య మరియు ఉన్నతమైన ఉద్యోగాలు స్పోర్ట్స్ రిజర్వేషన్ కోటాలో సాధించడానికి అవకాశం ఉంది అని విద్యార్థులకు ఈ సందర్భంగా తెలియజేశారు. అంతేకాకుండా విద్యార్థిని విద్యార్థులకు తైక్వాండో లోని మెలకువలు వాటిని సాధించే ప్రక్రియలు క్రమశిక్షణ అలాగే సమాజంలో జరిగే విపత్కర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ రాహుల్, ఫౌజల్, జి. అదిత్ లు పాల్గొన్నారనీ ఈ సందర్భంగా కోరుట్ల తైక్వాండో క్లబ్ నిర్వాహకులు, ఫౌండర్, తైక్వాండో కోచ్, నేషనల్ రెఫరీ మాస్టర్ నావనంది రమేష్ (నేతాజీ) తెలిపారు.

## ఘనంగా దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**జగిత్యాల మే 30 (ప్రజా మంటలు):** ఇందిరా భవన్‌లో ఘనంగా దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి శ్రీధర్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇందిరా భవన్ లో మంగళవారం మాజీ మంత్రి, కృషి చేయాలి అన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పిసిసి సెక్రెటరీ బండ శంకర్, మాజీ కౌన్సిలర్ రేపల్లె హరికృష్ణ,



ఏఐసీసీ కార్యదర్శి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. కర్ణాటక రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంలో శ్రీధర్ బాబు కృషి ఎనలేనిది అన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు మరింత పిసిసి మైనారిటీ సెక్రెటరీ మొయిజొద్దిన్, పిసిసి ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ చాంద్ పాషా, కమాల్, నక్క జీవన్, నే హాల్, బొల్లి శేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా మధు, రఘువీర్ గౌడ్, బీరం రాజేష్, అనిల్, రాగుల ప్రదీప్, కట్ట శివ, అర్బాబు, గంగాధర్, అథాహుల్లా, శ్రీనాథ రెడ్డి, సందీప్, పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా గుంటిపల్లి చారిటబుల్ ట్రస్ట్

**ధర్మసాగర్ మే 30 (ప్రజామంటలు):** మండలంలోని ముప్పారం గ్రామంలో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆర్థిక సహాయాలను అందజేయడంలో



ముప్పారం పరిరక్షణ సమితి, గుంటిపల్లి చారిటబుల్ ట్రస్ట్ ముందుంటున్నది. పలు సేవా కార్యక్రమాలలో ముందంజలో ఉన్న ఈ సంస్థ కుటుంబ పెద్దలను కోల్పోయిన ఆ కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ఇటీవల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కోరుకొప్పుల కుమారస్వామి, వేములకొండ లింగమ్మ, వెంకటమ్మ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదును అందజేసారు.

మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేసారు. గ్రామంలో ఏ కష్టం వచ్చినా, ప్రతి సమస్య పరిష్కారానికి తాము ముందుంటున్నామని సంస్థ నిర్వాహకులు గుంటిపల్లి వెంకట్ రేణుకలు ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వేములకొండ రజిత బిక్షపతి, ముంజ వెంకట్రాజం, వేములకొండ సారయ్య, గుర్రాల శ్రీనివాస్, కోతి సాంబరాజు గౌడ్, గుంటుపల్లి వెంకట్, వెల్దండ విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.



## రాష్ట్ర అవతరణ సన్నాహక సమావేశం

**కోరుట్ల టౌన్ మే 30 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రం అవతరించి 10వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను కోరుట్ల మండల స్థాయిలో వైభవంగా నిర్వహించాలని కోరుట్ల ఎంపీపీ తోట నారాయణ అన్నారు. కోరుట్ల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను జూన్ 2నుండి 22వ తేదీ వరకు 21రోజుల పాటూ మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టాలన్నారు. ప్రతీ రోజు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, వాటి ప్రయోజనాల గూర్చి ప్రజలకు తెలియజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. శాఖల వారిగా 21 రోజుల పాటు పండుగ వాతావరణంలో శతాబ్ది ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ఈ వేడుకలను కోరుట్ల మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీడీవో పీ. నీరజ, తహశీల్దార్ ఎన్. రాజేష్, కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ దుర్గా దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

**కోరుట్ల టౌన్ మే 30 (ప్రజామంటలు):** పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్ వద్ద గల శ్రీ దుర్గా దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పురోహితులు పాలెపు రాము శర్మ వైదిక నిర్వ



హణలో అమ్మవారికి పంచమృతాలతో అభిషేకాలు హెూమం నిర్వహించడం జరిగింది. తదనంతరం కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర శేఖర్, షికారి రామకృష్ణ, అల్లే రాము పిల్లల వైద్య నిపుణులు మిట్టపల్లి రాజేష్, వైద్యులు నడికట్ల సంతోష్, మధు శ్రీ, కొక్కుల నడిపి గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దేశాయిపేటలో పౌర హక్కుల దినోత్సవం

**చొప్పదండి మే 30 (ప్రజామంటలు):** దేశాయిపేట గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవానికి మండల పరిషత్ అధ్యక్షులు చిలుక రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.... ప్రతి మాసం చివరి వారంలో మండలంలో ప్రతి గ్రామ పంచాయతీ నందు మనము పౌర హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామని, దీని ముఖ్య ఉద్దేశం అతడు వర్గాల హక్కులు తెలుసుకొని వారి సుఖమైన జీవితానికి నాంది వేయడం సమాజంలో వారికి సమానత్వం, అభివృద్ధి ఫలాలు



అందజేయడం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. దేశాయిపేట సర్పంచ్ గుంట రవి, ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ కళావతి, ఆర్ ఐ అరుణ్, ఏఎస్సై రాజయ్య, పంచాయతీ కార్యదర్శి కిషోర్, స్థానిక అంబేద్కర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా చండీయాగము సుదర్శన వాస్తు హెూమము

**హైదరాబాద్ మే 30( ప్రజామంటలు):** రంగారెడ్డి జిల్లాలోని గోపన్ పల్లి లో బ్రాహ్మణ సంక్షేమ సదన్ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించనున్న నేపథ్యంలో మంగళవారం సుదర్శన



యాగము చండీయాగము, వాస్తు హెూమము, పంచగవ్య ప్రాశనము మంగళవారం ఉదయం నుండి వివిధ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజ, దంపతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 146 నదుల నుండి నది జలాల కలశాలతో మహిళలు సంకేపల్లి సుమలత సుధాకర్ శర్మ ఆధ్వర్యంలో గోపనపల్లి వరకు మంగళ వాద్యాలతో శోభాయాత్రగా తీసుకువెళ్లి వైదిక క్రతువులు నిర్వహించారు. బుధవారం ఉదయం 10:30 కు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందని అదేవిధంగా శిలాఫలక ఆవిష్కరణ జరుగుతుందని రమణాచారి తెలియజేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో బిజెపి ఎదురీత!

కర్నాటక ఫలితాలు వేరు..ఇక్కడ వేరు అంటూ బిజెపి ఉభయ తెలుగు రాష్ట్రాల నేతలు ఇటీవల చేసిన వ్యాఖ్యలు డొల్ల అని తేలిపోయింది. కరిమింగిన వెలగపండులా బిజెపి పరిస్థితి ఉంది. కర్నాటక ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బిజెపి పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది. చెప్పుకోవడానికి పెద్దగా సాధించిన విజయాలు లేవు...చేద్దామంటే పనులు కూడా లేవు. కేవలం ఇరు రాష్ట్రాల్లో ఇద్దరు సిఎంల పాలనను తిట్టి పోయడంతోనే అధికారంలోకి వస్తామన్న ఏకైక నినాదాన్ని ఎత్తుకున్నారు. నిజానికి రెండు తెలుగు రాష్ట్రాలకు బిజెపి చేసింది శూన్యం. కేంద్రం నిధులు ఇస్తున్నదని డబ్బా కొట్టుకోవడానికే సరిపో తోంది. రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలకు రావాల్సిన నిధుల వాటా తప్ప ఒక్క నయాపైసా ఎక్కువగా వెచ్చిం చడం లేదు. అయినా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ...లేస్తే మనిషిని కాదని ఇరు రాష్ట్రాల నేతలు హెచ్చరికలు చేస్తున్నారు. కర్నాటకలో డబుల ఇంజిన్ సాధించిందేమీ లేదని తేలిపోయింది. అక్కడ ప్రజలకు మంచి చేసే ఒక్క పనయినా చేయలేదని తేలింది. డబుల ఇంజిన్ పేరుతో దగా చేసారే తప్ప ప్రజలకు మేలు జరగలేదు. అక్కడ ఏం జరుగుతుందో నిత్యం మీడియా ద్వారా, వచ్చిపోయే ద్వారా తెలుస్తూనే ఉంది. తాజాగా తెలంగాణలో చేరికల కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఈటెల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు బిజెపి డొల్లతనాన్ని మరింతగా బయటపెట్టింది. బిజెపిలో చేరితే ఓటమి తప్పదన్న భావనలో నేతలు ఉన్నారు. పోతూపోతూ మునిగిపోయే నావను ఎక్కడం మంచిది కాదన్న అభిప్రాయంలో ప్రజలే కాదు..నేతలు ఉన్నారు. అందుకు తెలుగు రాష్ట్రాల్లో బిజెపిలో చేరేందుకు ఎవరూ ఉత్సాహం చూపడం లేదు. అలాగే బిజెపిలో చేరకుంటా ఉంటే గౌరవం అయినా దక్కుతుందన్న భావనలో ఉన్నారు. తెలంగాణ లో బలమైన ప్రాంతీయ పార్టీ నేతగా కెసిఆర్, ఎపిలో జగన్ ఉన్నారు. ఎపిలో టిడిపి కూడా బలంగానే ఉంది. అందుకే బిజెపిలో ఉన్న కన్నా లక్ష్మీనారాయణ టిడిపిలో చేరారు. తెలంగాణలో అయితే బిజెపికి తుంపిర్ల బలం తప్ప క్యాడర్, లీడర్ల బలం లేదు. బలగం కూడా లేదు. అందుకే బిజెపి పార్టీలో చేరాలనే నిర్ణయం నుంచి బీఆర్ఎస్ బహిష్కృత నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావులకు క్లారిటీ వచ్చినట్టు కనిపిస్తోంది. పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు నుంచి ఎలాంటి స్పష్టత లేకపోయినా బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దీనిపై నిర్వేదం వ్యక్తం చేశారు. వాళ్లను బీజేపీలోకి తీసుకురావడం అంత ఈజీ కాదని చెప్పడం వెనుక బిజెపికి అంత సీన్ లేదన్న విషయాన్ని చెప్పకనే చెప్పారు. కర్నాటక ఫలితాలు చూశాక, కెసిఆర్‌ఐ ఉన్న వ్యతిరేకతను అంచనా వేసుకుని పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించకున్నారనే ప్రచారం ఎప్పటి నుంచో



జోరుగా సాగుతోంది. బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తాజాగా చేసిన ప్రకటనతో వారు ఏ పార్టీలో చేరుతార్నది పక్కన పెడితే..బిజెపికి పెద్దగా ఆరదణ లేదన్న విషాయానికి బలం చేకూర్చారు. మరోవైపు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ చేయి అందుకోవడానికి ముహూర్తం కూడా ఖరారైనట్టు కూడా ప్రచారం నడుస్తోంది. జూన్ 8న కాంగ్రెస్ కండువా కప్పుకుంటారనే వార్తలు గుప్పుమంటున్నాయి. వారిద్దర్ని కాంగ్రెస్‌లోకి తీసుకురావడానికి ఎప్పటి నుంచో అధినాయకత్వం ప్రయత్నాలు చేస్తోంది. జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇద్దరూ తమ అనుచరుల, సన్నిహితులు, అభిమానులతో విస్తృతంగా చర్చలు జరిపారు. చివరకు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని జూపల్లి సన్నిహితులు బహిరంగం గానే చెబుతున్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావును తమ పార్టీల్లో చేర్చుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతలు పోటీ పడ్డారు. ఇరు పార్టీల అగ్రనాయకులతో వీళ్లిద్దరు మాట్లాడారు. కానీ కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అప్పటి వరకు బలంగా ఉన్నట్టు కనిపించిన బీజేపీ ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఆ పార్టీవైపు చూసేందుకు కూడా నేతలు ఉత్సాహం చూపడం లేదు. వాళ్లను బీజేపీలోకి తీసుకొచ్చేందుకు తాను ప్రయత్నిస్తే తన మైండ్ సెట్ మార్చేలా వాళ్లే కౌన్సిలింగ్ ఇస్తున్నారని ఈటల చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వాళ్లను బీజేపీ లోకి తీసుకురావడం అంత ఈజీ కాదన్నది చెప్పడం ద్వారా బిజెపి వైఫల్యాన్ని చెప్పారని భావించాల్సిందే. దీంతో వాళ్లిద్దరు వేరే కాంగ్రెస్‌లోకి వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. నిజానికి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ బలంగా ఉంది. బిజెపికి అక్కడ ఉనికే లేదు. ఇప్పటివరకు వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరకుండా మాత్రమే ఆపగలిగానని.. కానీ బీజేపీలోకి తీసుకు రాలేకపోయానని ఈటల చెప్పుకొచ్చారు. దీంతో పొంగులేటి, జూపల్లి ఇద్దరూ కూడా కాంగ్రెస్‌లో చేరనున్నట్లు పరోక్ష సంకేతాలు ఇచ్చినట్లయింది. అయితే కొత్త పార్టీ పెడతారన్న ప్రచారం కూడా ఉంది. ఏదేమయినా బిజెపిలో చేరరన్న సంకేతాలు బలంగానే ఇచ్చారు. మరోవైపు తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని గట్టి నమ్మకంతో ఉన్నారు. అంతే కాదు ఇతర నేతలందర్నీ కూడా కాంగ్రెస్ లోకి రావాలని రేవంత్ ఇప్పటికే పిలుపునిచ్చారు. కర్ణాటక ఫలితాలు తెలంగాణలో బీజేపీపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. మరోవైపు తెలంగాణ బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు ఇద్దరు మాజీ ఎంపీలు యత్నిస్తున్నట్టు సమాచారం. బీజేపీ లో పరిణామాలతో నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. వీరు బీజేపీకి బిగ్ షాక్ ఇచ్చేందుకు మాజీ ఎంపీలు సిద్ధమవుతున్నారు. మరోవైపు ప్రస్తుతం బీజేపీ క్యాడర్ సైతం అయోమయంలో ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తంగా తెలంగాణ బీజేపీలో గందరగోళం చోటు చేసుకుంది. అసలు పార్టీలో ఏం జరుగుతోందో అర్థం కావటం లేదని బీజేపీ కార్యకర్తలు వాపోతున్నారు. తాజా పరిస్థితులు బిజెపి ఎంత బలంగా ఉందో అంచనా వేయవచ్చు. తమకు తాముగా అతిగా ఊహించుకుం టున్న నేతలు నిజాలను గ్రహించడం లేదు. ప్రజలను కేవలం మాటలతో, పడికట్టు పదాలతో పడగొట్టలేమని బిజెపి గుర్తిస్తే మంచిది.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## లావవుతామా!

రామ్మూర్తి , సరోజమ్మల కుమారుడు కిరణ్. తొమ్మిదవతరగతి చదువు తున్నాడు, ఆరోజు ఆదివారం.స్కూల్ లేదు." కూరగాయలమ్మా... కూరగాయలు" అంటూగట్టిగాఅరుపువినిపించింది. ఓనడివయస్సు వ్యక్తితోపుడుబండి తోసుకుంటూ వస్తున్నాడు,

" కిరణ్ గిన్నె తీసుకురా" అని కేకేసి బండిని ఇంటిముందు ఆపింది సరోజమ్మ, కిరణ్ గిన్నె తీసుకొని వచ్చాడు.ఎదురింటి పార్వతమ్మ,

పక్కింటి శారదమ్మ కూడా బండిదగ్గరకు వచ్చారు,నాలుగుచక్రాల



తోపుడుబండిపై వంకాయలు,క్యారెట్లు,బెండకాయలు , కోసుగడ్డలు, ఉర్లగడ్డలుఉన్నాయి. కిలోవంకాయలధర అడిగింది సరోజమ్మ, ఇరవైరూపాయలుచెప్పాడు.కిలో ఉర్లగడ్డల ధర అడిగింది పార్వతమ్మ. ఇరవైరూపాయలు చెప్పాడు,

"పదిహేనురూపాయలుచేసుకోతీసుకుంటాం"అంది శారదమ్మ.

" ఆధరకు నాక్కూడా రాలేదమ్మా" అన్నాడు.

"పోనీ పదహారు రూపాయలకివ్వు" అంది సరోజమ్మ. ఇవ్వలేనన్నాడు. గీచిగీచి బేరమాడి పద్దెనిమిది రూపాయలకు ఒప్పించారు. అర కిలోవంకాయలు తీసుకుంది పార్వతమ్మ,

"అంతకచ్చితంగాతూచావు,బంగారమాఏంటి"అంటూ,కొసరుగా రెండు వంకాయలు తీసుకుందిపార్వతమ్మ, వాడువారించినా ఆమె వినలేదు,

అరకిలో ఉర్లగడ్డలు తీసుకుంది శారదమ్మ.

కొసరుగా రెండు గడ్డలు తీసుకుంది. సరోజమ్మకూడా అలాగే తీసుకుంది, వాడు బిక్కమోహంవేశాడు, ఇదంతాచూస్తున్న కిరణ్ ఆగలేకపోయాడు.

" అమ్మా! ఓమాట చెబుతా విను." అన్నాడు.

ఏంటో చెప్పు..." అంది సరోజమ్మ.

ఆయనకు కిలోకు మూడురూపాయలు లాభం మిగిలినా ఎన్ని కిలోలు అమ్మితే వందరూపాయలు లాభంవస్తుంది? కొసరు అంటూ అర కిలోకు రెండు కాయలు తీసుకుంటే ఆయనకు మిగిలేదేముంటుంది? కాళ్ళు,చేతులు నొప్పులు పుట్టేలా బండిని తోసుకుంటూ, తిరిగితే తప్ప

దినం గడవదు కదా! ఆయన తెచ్చే తిండి గింజలకోసం ఇంట్లో నాలాంటి పిల్లలు ఎదురుచూస్తుంటారు కదా! మామిడిపండ్లు, సపోటాల గంప మెడనొప్పులు పుట్టేలా తలపై మోస్తూ వచ్చే ఆమెను కూడా ఇలాగే బాధపెడతారు. దానం చేయటానికి మనస్సు రాకపోయినా పర్వాలేదు. కష్టపడేవారికి సరిపడే ప్రతిఫలంఇవ్వలేమా? గీచిగీచి బేరమాడి రెండు రూపాయలు,రెండు కాయలు తీసుకుంటే మనం లావవుతామా?"అన్నాడు,

కిరణ్ మాటలకు వాళ్ళు ఉలిక్కిపడ్డారు.

తలతిరిగినట్లయింది.ఎవరిదగ్గర బేరమాడాలో, ఎవరిదగ్గర బేరమాడ కూడదో అర్థమయింది. తానుతీసుకున్న రెండు కాయలు, రెండు రూపాయలు

తీసి ఇచ్చింది సరోజమ్మ. పార్వతమ్మ, శారదమ్మకూడా తిరిగిచ్చారు,

అంతవరకూ బేలగా చూస్తున్న ఆమనిషిముఖంలో సంతోషరేఖ తళుక్కుమంది.ఆయన ముఖంలో సంతోషాన్నిచూసి వాళ్ళ మనస్సు తృప్తితో నిండి పోయింది,

కిరణ్ ముఖం మల్లెపువ్వులా విచ్చుకుంది.

– డి.కె.చదువులబాబు,
9440703716.

# ధూమపానం... ఆరోగ్యానికి హానికరం

### మే 31...ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క ద్వారా తయారీ వల్ల పొగ విడుదల అవుతున్నందు వలన దీనికి 'పొగాకు' అనే పేరు వచ్చింది. దీని ఆకుల నుండి సిగరెట్లు, చుట్టలు తయారు చేస్తారు. దీనిని కొన్ని రకాల తాంబూలాలలో కూడా ఉపయో గిస్తున్నారు. క్రీస్తు పూర్వం 1400 ఏళ్ల నాడే పొగాకు వాడకం మొదలైంది. ఉత్తర, దక్షిణ అమెరికా ప్రాంతాల్లోని స్థానిక తెగల వారు పొగాకును దేవుని కానుకగా పరిగణించే వారు. వేడుకల్లో పొగ తాగేవారు. పొగాకు చుట్టల నుంచి వెలువడే ధూమ మేఘాల ద్వారా తమ ప్రార్థనలు భగవంతుని చేరుకుంటాయని వారు నమ్మేవారు. యూరోపియన్లు అమెరికాలో అడుగు పెట్టడం ప్రారంభ మయ్యాక క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి పొగాకు క్రమంగా యూరోపియన్ దేశాలకు, ఆ తర్వాత శరవేగంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బ్రిటిష్ వారి ద్వారా పొగాకు భారత దేశానికి చేరుకుంది. పొగాకు పరిచయం కావడానికి ముందు భారత దేశంలో ఎక్కువగా గంజాయి తోనే పొగ తాగేవారు. ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటు లోకి వచ్చిన తొలినాళ్లలో పొగాకును ఔషధంగా పరిగణించే వారు. సిగరెట్ల కంపెనీలు వైద్యులతో వ్యాపార ప్రకటనలు ప్రచారం చేసుకునేవి. 20వ శతాబ్దిలో సగానికి సగం కాలం ఇలాగే




గడిచింది. పొగాకు వల్ల క్యాన్సర్ వంటి అనర్థాలు తలెత్తు తున్నట్లు గుర్తించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పొగాకు వ్యతిరేక ప్రచారం ప్రారంభించాయి. పలు ప్రభుత్వాలు కూడా పొగాకు వాడకంపై ఆంక్షలు అమలులోకి తెచ్చాయి.

బొలీవియా మరియు పెరూ పొగాకు జన్మస్థలంగా పరిగణించ బడతాయి. క్రిస్టోఫర్ కొలంబస్ యాత్రల ద్వారా ఐరోపాకు తీసుకు రాబడినట్లు, అలా పొగాకు సాగు క్రమంగా ఉత్తర అమెరికా, చైనా, భారతదేశం, పూర్వ యుఎస్ ఎస్ఆర్ భూభాగంలో, ట్రాన్స్‌కాకాసియా, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, మోల్డోవా, ఉక్రెయిన్, క్రిమియా మరియు క్రాస్నోదర్ భూభాగంలో పెంచడం క్రమానుగతంగా జరిగాయి.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం మే 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పొగ తాగుతున్నారని, ఏటా పొగాకు కారణంగా 70లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది.

1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988, ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపు నిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగ దారులను ఏప్రిల్ 7వ తేదీన 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరింది. దానిని అనుసరించి 1988లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది.

ప్రపంచం లోనే అత్యధిక శాతం కిరిబాటి దీవిలో మూడులో రెండొంతుల మంది మగవాళ్లు ధూమపానానికి అలవాటు పడ్డారు. మూడొంతుల మంది ఆడవాళ్లు కూడా పొగ తాగుతున్నారు.

యూరప్‌లోని మాంటెనెగ్రో దేశంలో 46శాతం మంది ప్రజలకు పొగతాగే అలవాటుంది. గ్రీస్‌లో 50శాతం మంది మగవాళ్లు, 35శాతం మంది ఆడవాళ్లు ధూమపానం చేస్తారు. ప్రపంచం లోనే అత్యధికంగా ఈస్ట్ తైమూర్‌లో 80శాతం మంది మగవాళ్లు పొగ తాగుతారు. కానీ 6శాతం మంది ఆడవాళ్లకు మాత్రమే ఆ అలవాటుంది. రష్యాలో 15ఏళ్లు పైబడిన మగవాళ్లలో 60శాతం మంది పొగ తాగుతున్నారు. 23శాతం మంది మహిళలకు ఆ అలవాటుంది.

ఇక తక్కువగా పొగ తాగేవారు ఉండే దేశాలు...ఘనా, ఇథియోపియా, నైజీరియా, ఎరిత్రియా, పనామా... ఈ ఐదు దేశాలూ అతి తక్కువగా పొగ తాగే దేశాల జాబితాలో ముందు వరుసలో ఉన్నాయి. ఆఫ్రికాలో 14శాతం మంది మాత్రమే పొగ తాగుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఇటీవలి కాలంలో అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారత దేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి.

సిగరెట్లు, బీడీలు, సిగార్లు, హుక్కా వంటి ధూమపానం, గుట్కా నమలడం కోసం పొగాకును వివిధ రకాలుగా విక్రయిస్తారు. నికోటిన్ అనేది పొగాకులో ఉండే ప్రధాన విష పదార్థం. ఇది ధూమపానం వ్యసనానికి దారితీస్తుంది.

పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరి తిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే.

ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న కేన్సర్‌లు, గుండె జబ్బులు, నాన్-కమ్యూనికెబుల్ వ్యాధులు (ఎన్‌సిడిలు) వంటి దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధులు ధూమపానం వలనే సంభవిస్తాయి.

పొగాకు తాగేవారు శ్వాస సంబంధిత సమస్యలను కలిగి ఉంటారు ఎందుకంటే, పొగాకు ఊపిరి తిత్తులను పూర్తిగా ప్రమాదానికి గురి చేస్తుంది. అంతేకాకుండా, వీరిలో అధిక శ్లేష్మంతో కూడిన దగ్గు కూడా వస్తుంది. 80% కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలకు ధూమపానం కారణమని తెలింది. సిగరెట్లలో 70కి పైగా హానికరమైన క్యాన్సర్ కలిగించే రసాయనాలు ఉంటాయి. ప్రస్తుత కో విడ్ మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో పొగ త్రాగడం చాలా వరకు తగ్గింది. పొగ తాగడం నేరుగా ఊపిరి తిత్తుల పై ప్రభావం చూపే విషయం వల్ల భయం ప్రధాన కారణం అయితే, లాక్ డౌన్ కట్టుదిట్టమైన చర్యల వల్ల షాపులు ఎక్కువ సమయం మూసి ఉండడం, ఇళ్లనుండి బయటికి వెళ్ళలేక పోవడం ధూమపానానికి ప్రతిబంధకాలుగా మారడం పొగాకు వాడకం తగ్గడానికి కొన్ని కారణాలు.



-ఆర్కె సంగనభట్ల
9440595494

# టిడిపిని ఊరిస్తున్న కర్నాటక ఫలితం


తెలుగుదేశం పార్టీ కూడా తాయిలాలనే నమ్ముకుంది. జగన్ బటన్ నొక్కుడు విధానాలతో పార్టీలో భయం పట్టుకున్నట్లుగా కనిపిస్తోంది. అందుకే ప్రజలను మచ్చిక చేసుకోవాలంటే . అంతకు మించి అన్న రీతిలో తాయిలలకు సిద్దం పడింది. ఎన్టీర్‌ను ఆకాశానాకి ఎత్తడం,, పెద్ద ఎత్తున




సంక్షే పథకాలు ప్రకటించడం ద్వారా మాత్రమే జగన్‌ను ఢీకొన వచ్చన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చాడు. ఈ క్రమంలో ఎన్టీఆర్ శతజయంతి వేళ జరిగిన మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఎన్నికల శంఖారావం పూరించింది. గత ప్రభుత్వానికి ఇప్పుడు ప్రభుత్వానికి పోలిక చూడండి... మీకు మంచి జరిగి తేనే ఓటు వేయండి అంటూ ప్రతి సభలో జగన్ చెబుతున్నారు. అదే ప్రచారాన్ని టీడీపీ అంది పుచ్చు కుంది. ప్రస్తుతం జగన్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలతో వస్తున్న డబ్బులు ఎంత తాము అధికారంలోకి వస్తే ఎంత వస్తుందనే బేరీజు వేస్తూ ప్రచారం మొదలు పెట్టారు. లెక్కలతో వివరిస్తూ ఈ ఆరు పథకాలతోనే తాము అధికారంలోకి వస్తే ఏడాదికి ఒక్కో ఇంటికి లక్షరూపాయలకు పైగా వస్తుందని ప్రచారం చేస్తున్నారు. తెలుగుదేశం మేనిఫెస్టోపై కర్ణాటక ఎన్నికల ప్రభావం పడిందని స్పష్టంగా తెలుస్తోంది. ఇలాంటి హామీలతోనే కర్ణాటక ప్రజలను ఆకట్టుకుంది కాంగ్రెస్. ముఖ్యంగా మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యో భృతి, ఉచిత విద్యుత్ లాంటి హామీలి కాంగ్రెస్‌ను అధికారాన్ని కట్టబెట్టాయి. అదే ఫార్ములాను ఇప్పుడు టీడీపీ అమలు చేస్తోంది. తొలి విడత మేనిఫెస్టో విడుదల చేసిన ఆ పార్టీ ప్రజల్లో విస్తృత చర్చకు దారి తీసింది. టీడీపీ అధికారంలోకి వస్తే ఉన్న పథకాలు పీకేస్తారని వైఎస్ఆర్‌సీపీ చేస్తున్న ప్రచారానికి ఈ మేనిఫెస్టోతో కౌంటర్ ఇచ్చింది. తాము అధికారంలోకి వస్తే ఉన్న పథకాల కంటే మరింత మెరగ్గైనవి ఇస్తామంటూ ప్రచారం మొదలు పెట్టింది. ప్రస్తుతం సంక్షేమం పేరుతో జగన్ ఇస్తున్న పథకాలను కొనసాగిస్తామని చెప్పకనే చెప్పింది. ప్రజల్లో కొత్త అనుమానలు రాకుండా అలాంటి పథకాలనే మేనిఫెస్టోలో పెట్టింది. ప్రస్తుతం అమ్మ ఒడి పథకం ద్వారా సంవత్సరానికి 15 వేలు ఇస్తున్నారు. స్కూల్ నిర్వహణకు కొంత కట్ చేసుకుంటున్నారు. ఇంట్లో ఒక బిడ్డకు మాత్రమే ఇది వర్తిస్తుంది. టీడీపీ అమ్మఒడి పథకానికి పేరు మార్చి తల్లికి వందనం పేరు పెడతామని పేర్కొంది. అదే 15 వేలు ఇస్తామని చెప్పింది. అయితే ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామని హామీ ఇచ్చింది. 45 ఏళ్లు దాటిన మహిళలకు చేయూత కింద ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఏడాదికి 18 వేలు అందిస్తోంది. దాన్ని కాస్త మార్చిన టీడీపీ 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని ప్రకటన చేసింది. ప్రస్తుతం రైతులకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి 12వేలు వరకు వస్తుంది. ఇందులో కేంద్రం వాటా కూడా ఉంటుంది. ఇప్పుడు తెలుగుదేశం రిలీజ్ చేసిన మేనిఫెస్టోలో దాన్ని 20వేలకు పెంచారు. తాము విజయం సాధిస్తే రైతుకు సంవత్సరానికి 20 వేలు ఇస్తామని ప్రకటించారు. ప్రస్తుతం జగన్ సర్కారు ఇవ్వని మహిళలకు ఉచిత ప్రయాణం, మూడు సిలిండర్లు ఫ్రీ, నిరుద్యో భృతి, ఇంటింటికీ కుళాయి, బీసీ చట్టం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉన్న నిబంధనల్లో మార్పులు వంటి వాటిని టీడీపీ అదనంగా చేర్చించింది. టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోపై సెటైర్లు కూడా బాగా పడుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారంటూ వైసీపీ లీడర్లు ప్రశ్నిస్తున్నారు. మేనిఫెస్టో అంటేనే చంద్రబాబుకు చిత్తుకాగితం సమానమని అందుకే లేనిపోని హామీలు ఇస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా వైఎస్ఆర్‌సీపీ అనుకూలంగా ఉన్న వారు కూడా అదే స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. గతంలో కూడా చాలా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటన్నింటినీ ఇవ్వకుండా మోసం చేసిన సంగతిని గుర్తు చేస్తున్నారు. ఉచిత పథకాలతో రాష్ట్రాన్ని శ్రీలంకలా తయారు చేస్తున్నారని ఇన్నాళ్లు టీడీపీ లీడర్లు, అనుకూల మీడియా విపరీతంగా విమర్శలు చేసింది. ఇప్పుడు దానికి మించిన హామీలతో టీడీపీ తొలి మేనిఫెస్టో రిలీజ్ చేసింది. మరి ఆ విమర్శలకు వీళ్లు చెప్పే సమాధానం ఏంటీ అనేది చాలా మంది ఎదురు చూస్తున్నారు. సంపద సృష్టిస్తామనే హామీ కాకుండా ఎలా ఆదాయన్ని పెంచుతారనే క్లారిటీ ఇవ్వకుంటే మాత్రం ఇది బెడిసి కొట్టే ప్రమాదం ఉంది. హైదరాబాద్ వంటి ఆదాయం తీసుకొచ్చే నగరం ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కటీ లేదు. మిగతా ఆదాయాలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. పన్నులు వసూలు చేయాలి. అంటే ప్రజలపై భారం వేయాల్సిందే. పన్నుల పెంపును కూడా టీడీప వ్యతిరేకిస్తోంది. మరి ఇన్ని ఉచిత పథకాలు ఇవ్వడానికి నిధులు ఎలా తీసుకొస్తారో చెప్పాల్సిన బాధ్యత టీడీపీ నేతలపైనే ఉంటుంది. ఇకపై వాళ్లు ఛేదించాల్సిన టాస్క్ ఇది. ఇప్పుడున్న ప్రభుత్వాని కంటే తాము ఎలా మెరుగ్గా ఆర్థిక నిర్వహణ చేయగలుగుతామో ప్రజలను ఒప్పించి మెప్పించాల్సి ఉంది. ఇప్పటికే టీడీపీ మేనిఫెస్టో అనగానే చాలా ఫేక్ మెసేజ్‌లో సోషల్ మీడియాలో తిరుగుతున్నాయి. రుణమాఫీ లాంటి హామీలు టీడీపీ మేనిఫెస్టోలో ఉన్నాయంటు ప్రచారం నడుస్తోంది. అలాంటి ఫేక్ ప్రచారాన్ని తిప్పి కొట్టి అసలైన మేనిఫెస్టోను ప్రజల ముందుకు తీసుకెళ్లడం కూడా టీడీపీకి ఓ సవాల్ లాంటిది.

# తోకపార్టీలుగా మారుతున్న కమ్యూనిస్టులు

కమ్యూనిస్టులు తెలంగానలో మరోమారు పొత్తులతో సీట్లు కొట్టేయాలన్న ఎత్తులు వేస్తున్నారు. మునుగోడులో తమదే విజయం అన్న ధీమాలో ఉన్నారు. అందుకే ఇప్పుడు తమ పాతసీట్లపై కన్నేశారు. కనసీం ఓ పదిపదిహేను సీట్లననయినా బిఆర్ఎస్ నుంచిరాబట్టుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో వీరతాళ్లు వేసుకుని గ్రామాల్లో ఉపన్యాసాలు దంచుతున్నారు. ప్రజలను కలుపుకుని పోరాడాలన్న ఆకాంక్ష కమ్యూనిస్టు కార్యకర్తల్లోఉన్నా నేతలు ముందరి కాళ్లకు బంధం వేస్తున్నారు. ఇతర పార్టీలతో పొత్తులకు వెంపర్లాడుతున్న లెఫ్ట్ నేతలు సంస్థాగతంగా బలహీనం అవు తున్నాయి. గతంలో కమ్యూనిస్టులకు ఉన్న ప్రజాదరణ కాలక్రమేణా కనుమరుగవుతోంది. మారుతున్న కాలానుగుణంగా సిద్ధాంతాలను మార్చుకోకపోవడం లేదు. వీరు ఎంతసేపూ



మరో పార్టీకి తోకపార్టీగా మారడం మినహా గట్టిగా చేస్తున్న ప్రయత్నాలు చేయడం మానేశారు. తెలంగాణలో పూర్తిగా అదృశ్యం అయిన లెఫ్ట్ పార్టీలు..మళ్లీ కెసిఆర్ తోక పట్టుకుని నడిచే ప్రయత్నం చేస్తున్నారు. కెసిఆర్ నీడలో బిజెపిని విమర్శించడం తప్ప సమస్యలపై సమరం చేసిన సందర్భాలు శూన్యం. అయినా ఆ పార్టీల్లో ఆత్మవిమర్శ అన్నది మచ్చుకైనా కానరావడం లేదు. పోరాటాల్లో ఆరితేరిన లెఫ్ట్ పార్టీలు ఎందుకనో ప్రజల్లో స్థానం సంపాదించు కోలేక పోతున్నారు. లెఫ్ట్ బలహీనం కారణంగా ఇతర రాజకీయ పార్టీలు తమ స్థానాలను పదిలం చేసుకోవడంతో పాటు బలపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం అవసరం. అందుకు లెఫ్ట్ పార్టీలు విభేదాలు పక్కకు పెట్టి కనీసం కూటమిగా అయినా ముందుకు సాగాలి. కానీ కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా కూటమి అవకాశాలను వారే దెబ్బతీస్తున్నారు. విలీనం కావాలన్న ఆశ ఎలాగూ నెరవేర నప్పుడు కనీసం కూటమిగా ముందుకు సాగాలన్న గట్టి నిర్ణయం తీసు కోవడం లేదు. ప్రస్తుతం దేశం క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటోందనీ.. ఈ దశలో వామపక్షాల ఐక్యత అత్యవసరమని పలు వామపక్ష పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, బ్యాంకు ఉద్యోగులు, మేధావులు వేర్వేరు రూపాల్లో నిరసన గళం వినిపిస్తున్నారు. ఇది మరింత విస్తృతమవ్వాల్సి ఉంది. ఇందుకు కమ్యూనిస్టులు నిస్వార్థంగా అడుగులు వేయడం లేదు. అందుకే భాజపా వ్యతిరేకగళాలు ఒకేతాటి మీదికి రావాలన్న ఆకాంక్ష బలంగా వినిపిస్తున్నా కార్యరూపంలోకి రావడం లేదు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు, మేధావులు, సిద్ధాంత కర్తలు, మైనారిటీలు, దళితులందరూ ఒకే వేదిక మీదకు రావడంపై తక్షణం దృష్టిపెట్టాల్సి ఉంది. వామపక్ష కూటమి విదేశాల్లో విజయాలపై చర్చిస్తున్నా దేశంలో మాత్రం అందుకు అనుగుణంగా అడుగులు పడడం లేదు.

# దశాబ్ది ఉత్సవాల వేళ

## ఎఎస్ఐలకు ఎస్ఐలుగా ప్రమోషన్లు

**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్.. ఏఎస్ఐలకు శుభవార్త వినిపించారు. తెలంగాణ పోలీసుల ప్రశంసనీయమైన కృషి, అవిశ్రాంత సేవలు, అంకితభావాన్ని తెలంగాణ ప్రభుత్వం గుర్తించిందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పోలీసుల కృషి, సేవలకు గుర్తింపుగా.. 75 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పించినట్లు డీజీపీ అంజనీ కుమార్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# బ్రిటిషర్లను మించిన దోపిడీ

## మోడీ, కెసిఆర్‌ల పాలనపై పొన్నాల మండిపాటు

**జనగామ,మే30(ప్రజా మంటలు):** దేశాన్ని గతంలో బ్రిటీష్ వాళ్లు దోచుకుంటే ఇప్పుడు కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ దోచుకుంటున్నారని టీపీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. బ్రిటిషర్లకు వీరిద్దరికీ పెద్ద తేడా లేదన్నారు. ప్రజా సంక్షేమం విస్మరించి పాలన సాగిస్తున్న వారికి తగిన గుణపాటం చెప్పేరోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. జనగామలోని తన క్యాంపు ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడారు. 2 కోట్ల



ఉద్యోగాలు ఇస్తానని మోడీ, ఇంటికో ఉద్యోగం ఇస్తానని కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేశారన్నారు. సీఎం కేసీఆర్ చెప్పేవన్నీ అబద్ధాలేనని, అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ చేశారు. అకాల వర్షాలకు పంట నష్టపోయి రైతులు ఇబ్బంది పడుతుంటే ఆదుకోవాల్సిన సర్కార్ కొర్రీలతో మరిన్ని కష్టాలు పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ 25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వచ్చే నాటికి రాష్ట్రంలో 4.91 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే 2022 నాటికి 3 లక్షల మందే ఉన్నారని, రిటైర్డ్ అయిన పోస్టులను తిరిగి భర్తీ చేయడం లేదన్నారు. పేదల పక్షాన నిలబడేది కాంగ్రెస్సే అన్నారు. యూత్ డిక్లరేషన్‌పై అవగాహన పెంచేందుకు 16 నుంచి 35 ఏండ్ల మధ్య గల యువతకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# సద్దుమణగని వర్సిటీ వివాదం

## రిజిస్ట్రార్ కార్యాలయం ముందు విద్యార్థుల ఆందోళన

**నిజామాబాద్,మే30(ప్రజా మంటలు):** తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సీటు వ్యవహారం మళ్ళీ వివాదాస్ప దంగా మారింది. తెలంగాణ యూనివర్సిటీలో మళ్ళీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి బాధ్యతలు చేపట్టారు. మూడు రోజుల క్రితం ప్రొఫెసర్ కనకయ్యను వైస్ ఛాన్సులర్ రవీందర్ గుప్తా రిజిస్ట్రార్‌గా నియమించారు. యూనివర్సిటీ పరువును బజారుకీడుస్తున్నారని విద్యార్థులు, సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రిజిస్ట్రార్ ఛాంబర్‌లో విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ఎవరు రిజిస్ట్రారో తేల్చాలని విద్యార్థులు పట్టుబడుతున్నారు.



ఇద్దరు రిజిస్ట్రార్లతో విద్యార్థులు, సిబ్బంది వివాదానికి దిగారు. ఛాంబర్ ముందు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి విద్యార్థులను బయటకు పంపారు.

# ధరణితో రైతుల బతుకులు ఆగం

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

## హుస్నాబాద్‌లో పోటీచేసి తీరుతాం: చాడ

**కరీంనగర్,మే30(ప్రజా మంటలు):** ధరణి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని,: తెలంగాణ రాష్ట్రంలో ధరణి పోర్టల్ తో అవినీతి తగ్గిందనడం నిజం కాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. ధరణికి సమాంతరంగా మాన్యువల్ రికార్డులు కూడా ఉండాలన్నారు. ధరణిలో తప్పుల వల్ల చాలా మంది రైతుల బతుకులు బజారున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ల వారీగా చేస్తామన్న భూ సర్వే ఏమైందని ప్రశ్నించారు. పోడు భూముల పట్టాల కోసం11 లక్షల మంది దరఖాస్తులు చేసుకుంటే.. 4 లక్షల మందికే ఇస్తే.. మిగతా వారి సంగతి ఏంటని ప్రశ్నించారు. కరీంనగర్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో చాడ వెంకట్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో పొత్తులపై సీపీఐ జాతీయ కమిటీలో చర్చించి.. నిర్ణయం తీసుకుంటుందని చాడ వెంకట్ రెడ్డి చెప్పారు. తెలంగాణలోనూ ప్రజాతంత్ర, లౌకికవాద విశాల




వేదిక కోసం ప్రయత్నిస్తామన్నారు. ప్రజల కోరిక మేరకే తాము పని చేస్తామని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి సీపీఐ పోటీ చేయాలన్న ఆలోచన ఉందన్నారు. కమ్యూనిస్టులు పార్లమెంటులో లేకపోవడం వల్ల ప్రజల గొంతు మూగబోయిందని చాలా సర్వేలు చెబుతున్నాయన్నారు. జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో బీజేపీ హటావో దేశ్ కి బచావో అనే నినాదంతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

## రాజేశ్ యాదవ్ అనే వ్యక్తి అరెస్ట్..రూ.9.50 లక్షలు స్వాధీనం

**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** జూబ్లీహిల్స్ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో రాజేష్ యాదవ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ నెల 12న గర్భిణీని రాజేష్ యాదవ్ బెదిరించి రూ.10 లక్షలు అపహరించాడు. నిందితుడి నుంచి రూ.9.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు జల్సాల కోసం దోపిడీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 12న జూబ్లీహిల్స్‌లో నిండు గర్భిణి మెడ మీద కత్తి పెట్టి 10 లక్షల రూపాయలు దోపిడీ చేసి పారిపోయాడు. అతణ్ని పట్టుకోవడానికి నగర పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి ముమ్మరంగా గాలించారు. నిందితుడు రోడ్డు నంబరు 52లో ఉన్న రాజు ఇంటి గురించి అవగాహన ఉన్నట్టుగానే నడుచుకుంటూ వచ్చి, నిచ్చెన సాయంతో లోపలికి ప్రవేశించినట్టు సీసీ కెమెరాల ద్వారా తెలుస్తోంది. దీంతో.. ఇది బాధితు కుటుంబానికి తెలిసిన వారి పనై ఉంటుందా అని కూడా పోలీసులు అనుమానించారు. పారిపోవడానికి అవసరమైన క్యాబ్‌ను గర్భిణి చేతే దుండగుడు బుక్ చేయించుకున్నాడు. ఆ క్యాబ్‌లో షాద్‌నగర్‌కు వెళ్లి, అక్కడే బస్టాప్ చుట్టు పక్కల కాసేపు తచ్చాడినట్టు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. అనంతరం అక్కడ ఉన్న రెండు షాపుల్లో మూడు గంటల పాటు షాపింగ్ చేశాడు. ఓ షాపులో తన దుస్తులు మార్చి, కొత్త వాటిని ధరించాడు. ఆ తర్వాత కనిపించకుండాపోయాడు. ఇప్పుడు పోలీసులకు దొరికిపోయాడు.






# అభివృద్ధిలో దూసుకుపోతున్న అచ్చంపేట

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి హరీశ్‌రావు శ్రీకారం

**నాగర్‌కర్నూల్,మే30(ప్రజా మంటలు):** అచ్చంపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే పట్టుబట్టి పనులు చేస్తున్నారని అభినందించారు. నియోజకవర్గం పరిధిలోని మన్ననూరులో బీటీ రోడ్డు పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, ఎంపీ రాములు, టీఎస్ ఎంఐడీసీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గతంలో కరెంటో కావాలంటే ఎంతో గోసపడే వాళ్లం.. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన కరెంట్‌ను కేసీఆర్ ప్రభుత్వం అందిస్తున్నదని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాల ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. ఏడాదికి రెండు పంటలు పండించుకునే విధంగా సాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. పండిన పంటలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసి వారి అకౌంట్లో డబ్బులు పడే విధంగా చేస్తున్నాం. ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేసి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం అని మంత్రి హరీశ్‌రావు గుర్తు చేశారు. అంతకుముందు శ్రీశైలంలో తెలంగాణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘం నిర్మించిన నూతన భవన ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి హాజరయ్యారు. యాత్రికులు బస చేసేందుకు ఆధునిక వసతులతో భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణానికి శ్రీశైలం దేవస్థానం వారు అందించిన సహకారాన్ని కూడా మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. ఆర్య వైశ్యులు వర్తక వ్యాపారాల్లోనే కాకుండా సేవా కార్యక్రమాలను చేయడంలో కూడా ముందంజలో ఉంటారని అన్నారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవారి ఆశీస్సులు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ అందుతూ ఆయురారోగ్యాలతో బాసిల్లాలని మంత్రి హరీశ్‌రావు కోరుకున్నారుద.

# తొండలు, పాములు, వణ్యప్రాణులతో థీమ్ పార్టీ

## హైదరాబాద్ పబ్బులో వేలం వెర్రి

## సోషల్ మీడియా పోస్ట్‌తో వెలుగులోకి అక్రమాలు

**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** పబ్బుల్లో యువతీయువ కులను ఆకర్షించేందుకు పబ్ నిర్వాహకులు ఎన్నో తంటాలు పడుతుంటారు. ఈ క్రమంలో వేలం వెర్రి మితిమీరుతుంది. హైదరాబాద్‌లోని ఓ పబ్‌లో కస్టమర్ల కోసం నిర్వహకులు చేసిన పనిని చూస్తే అంతా అవాక్కవ్వాల్సిందే. కస్టమర్లను ఆకర్షించేందుకు జూబ్లీహిల్స్‌లోని గ్సోరా పబ్‌లో నిర్వాహకులు ఏకంగా జంతు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కస్టమర్ల కోసమే ఇదంతా చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ట్విట్టర్ ద్వారా ఓ యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నెలరోజుల క్రితం సైబరాబాద్‌లోనూ ఇదే రీతిలో పబ్‌లో నిర్వాహకులు జంతువులను ప్రదర్శనను ఏర్పాటు చేశారు. పాతబస్తీ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి నుంచి జంతువులను తీసుకొచ్చినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. కస్టమర్లను ఆకర్షించేందుకు పబ్ నిర్వాహకులు ఏకంగా జంతువులను ప్రదర్శనకు పెడుతుండటంపై



స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ స్పందించారు. ఇటువంటి చర్యలు సిగ్గు చేటు అంటూ ట్వీట్ చేశారు. డీజీపీ, సీపీ హైదరాబాద్ దృష్టికి తీసుకెళ్తా అంటూ అరవింద్ కుమార్ ట్వీట్ చేశారు. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులకు జూబ్లీహిల్స్ పోలీసులు సమాచారం అందజేశారు. ఇంతకీ ఏం జరిగిందంటే..హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోని ఓ పబ్ భిన్నంగా.. వైవిధ్యంగా ఆలోచించింది. ఇవన్నీ రొటీన్ అనుకున్నదో ఏమో.. పాములు, తొండలు, పిల్లులు, కుక్కలను పబ్ లో పెట్టింది. వాటితో ఆడుకోవచ్చు.. ఒంటిపై తిప్పుకోవచ్చు అంటోంది.

మనుషులతో పాటు జంతువుల మధ్య కూడా మందు పార్టీ ఎంజాయ్ చేయమంటోంది. ఇప్పుడు ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వైల్డ్ జంగిల్ పార్టీ థీమ్‌లో భాగంగా ప్రత్యక్ష విదేశీ వన్యప్రాణులను చేర్చింది. దీనికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై పలువురు నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్లబ్బుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వారాంతంలో తమ ప్రాంగణంలో అన్యదేశ వన్యప్రాణులను ప్రదర్శనకు ఉంచిందని.. దీనికి సంబంధించిన కథనాలు వారి ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఉన్నాయని, దయచేసి చర్యలు తీసుకోండంటూ ఓ వ్యక్తి సోషల్ మీడియాలో కోరారు.

# మారిన రాష్ట్ర వ్యవసాయ ముఖచిత్రం

## దేశానికి ధాన్యాగారంగగా తెలంగాణ

## జిల్లాలో 12 సీట్లు మళ్లీ గెలుస్తాం: గుత్తా ధీమా

**నల్లగొండ,మే30(ప్రజా మంటలు):** సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్ర వ్యవసాయ ముఖచిత్రమే మారిపోయిందని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ దేశానికి ధాన్యాగారం అయ్యిందని అన్నారు. దీని వెనక కెసిఆర్ కృషి, తపన ఉందన్నారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రంలోని సబ్బండవర్గాలు, సకల జనులు సంతోషంగా ఉన్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో లబ్దిజరిగిందన్నారు. అభివృద్ధిని చూసి తట్టుకోలేక కాంగ్రెస్ వాళ్లు అసూయతో రగిలిపోతున్నారని విమర్శించారు. అందుకే రాష్ట్ర అవతరణ ఉత్సవాలపై అవాకులు చవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నల్లగొండ జిల్లాలో 12 మంది ఎమ్మెల్యే స్థానాలను బీఆర్ఎస్ మళ్లీ కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన



తొమ్మిదేండ్లలోనే వ్యవసాయ ముఖచిత్రం మారిపోయిందని చెప్పారు. నల్లగొండలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులు చాలా సంతోషంగా ఉన్నారని, దేశంలో అత్యధిక జీతాలు ఇస్తున్న ప్రభుత్వం తెలంగాణ అన్నారు. ఇప్పటికు 1.5 లక్షల ఉద్యోగాల భర్తీ పూర్తయిందని వెల్లడించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిందని తెలిపారు. అన్ని రంగాల్లో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కానీ ప్రతిపక్షాలు అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తామని కాంగ్రెస్, బీజేపీలు పగటి కలలు కంటున్నాయని ఎద్దేవాచేశారు. దేశ ప్రజలు కూడా కేసీఆర్ నాయకత్వం కావాలని కోరుకుంటున్నారని, కేసీఆర్ అంటేనే భరోసా అని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. జూన్ 2 నుంచి 22 రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని, ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

# సికింద్రాబాద్ జ్యుయలరీ షాపు దోపీడీ కేసు

## ఐటి అధికారులమంటూ రెండుకిలోల బంగారంతో ఉడాయింపు

## ఛేదించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

## మహారాష్ట్రకు చెందిన గ్యాంగ్‌గా గుర్తింపు

## నలుగురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడి

**హైదరాబాద్,మే30(ప్రజా మంటలు):** సికింద్రాబాద్ జ్యుయలరీ షాపు దోపీడీ కేసును పోలీసులు ఛేదించారు. ఐటీ అధికారుల పేరుతో సికింద్రాబాద్లోని జ్యుయలరీ షాపులో దాదాపు రెండు కిలోల బంగారం దోచుకున్న ముఠాను హైద్రాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని థానేలో జకీర్, రహీమ్, ప్రవీణ్, అక్షయ్ లను అదుపులోకి తీసుకున్నారు. వీరికి సహకరించిన హైదరాబాద్ కు చెందిన మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి చోరీ చేసిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్లో మే 27వ తేదీన మధ్యాహ్నం భారీ చోరీ జరిగింది. ఐటీ అధికారులమంటూ వచ్చిన కొందరు దుండగులు.. హర్ష జ్యువెలరీ దుకాణంలో 1700 గ్రాముల బంగారం దోచుకుని పరారయ్యారు. శనివారం ఐదుగురు మోండా మార్కెట్లోని హర్ష జ్యువెలరీ దుకాణానికి వచ్చారు. బంగారం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ మూడో అంతస్తులో ఉన్న దుకాణం యజమాని వద్దకు వెళ్లి బెదిరించారు. దుకాణంలో ఉన్న బంగారం మొత్తం తనిఖీ చేయాలంటూ సిబ్బందిని పక్కన కూర్చోబెట్టారు. ఇక షాపులో 1700 గ్రాముల బంగారానికి సంబంధించిన ఎలాంటి పన్ను చెల్లించలేదని ..దాన్ని స్వాధీనం చేసుకుని పరారయ్యారు. దుకాణ యజమాని ఆ ప్రాంతంలో ఉన్న మిగితా జ్యువెలరీ దుకాణాల యజమానులకు ఐటీ అధికారులు వచ్చి బంగారం తీసుకెళ్లారన్న విషయాన్ని వివరించాడు. అయితే ఐటీ అధికారులు ఇష్టం వచ్చి తనిఖీలు చేయరని..ముందుగా నోటీసులు ఇస్తారని చెప్పడంతో అవాక్కైన యజమాని.... పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ చోరీ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుల కోసం 5 ప్రత్యేక బృందాలతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూడా గాలించారు. నిందితులు మహారాష్ట్ర థానేకు చెందిన గ్యాంగ్‌గా పోలీసులు తేల్చారు. వారిని పట్టుకునేందుకు కొన్ని బృందాలు మహారాష్ట్రకు వెళ్లాయి. అయితే అంతకముందు నిందితులు చోరీ తర్వాత ఆటోలో జేబీఎస్ వెళ్లినట్లు సీసీ టీవీలో రికార్డయింది. అక్కడి నుంచి ఈ ముఠా కూకట్‌పల్లి, పటాన్‌చెరు మీదుగా మహారాష్ట్ర వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. మహరాష్ట్ర పోలీసుల సహకారంతో హైద్రాబాద్ టాస్కోర్స్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# ధాన్యం కొనుగోళ్ల కోసం రైతుల ఆందోళన

## వరి కొనుగోలు కేంద్రం వద్ద నిరసనలు

**వికారాబాద్,మే30(ప్రజా మంటలు):** వరి ధాన్యం కొనుగోలు చేయాలంటూ తెలంగాణ రాష్ట్రంలో పలు చోట్ల రైతులు ఆందోళనలు, నిరసనలు చేపడుతూనే ఉన్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా దోమ మండలం బొంపల్లి వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిరసన చేపట్టారు. తమ వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రోడెక్కారు. పరిగి, మహబూబ్ నగర్ ప్రధాన రహదారిపై వరి ధాన్యానికి నిప్పుపెట్టి.. గంటకుపైగా రాస్తారోకో నిర్వహించారు. అధికారులు వెంటనే రావాలంటూ నినాదాలతో హోరెత్తించారు.రైతుల ఆందోళనలతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఘనీ బ్యాగులు ఇవ్వకపోవడంతో చాలా మంది రైతుల వరి ధాన్యం కల్లాల వద్దే ఉందని, కోనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించేందుకు లారీలు లేవని, నేరుగా తమను రైస్ మిల్లుల వద్దకు పంపుతున్నారని, అక్కడ తమతో హమాలీ పనులు చేయిస్తున్నారని రైతులు వాపోయారు.

కొనుగోలు కేంద్రాల వద్ద వర్షం వస్తే ధాన్యంపై కప్పేందుకు కనీసం టార్పలిన్లు కూడా లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి.. తమ వరి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీశైలంలో మంత్రి హరీష్ రావు పూజలు

**శ్రీశైలం,మే30(ప్రజా మంటలు):** శ్రీశైల మహాక్షేత్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని మంత్రి మంత్రి హరీశ్ రావు దర్శించుకున్నారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డితో కలిసి శ్రీశైల క్షేత్రానికి వెళ్లిన మంత్రి హరీశ్‌కు.. ఆలయ ప్రధాన గోపురం వద్ద దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేయగా.. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



# కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

**కోరుట్ల టౌన్ మే 30 (ప్రజామంటలు):** కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్ అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో 22 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపినారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇట్టి సమావేశం లో హ్యాండ్ బోర్ లకు మరియు వాటర్ పైప్ లైన్ లీకేజీ మెటీరియల్ కొనుగోలుకు రూ" 10.00 లక్షలు, మంచి నీటి సరఫరా లీకేజీ లో నీటిని తొలగించుటకు దివాటరింగ్ మిషన్ %డ% రోడ్ కట్టింగ్ డ్రిల్లింగ్ మిషన్‌లను కొనుగోలుకు రూ" 1.50 లక్షలు, కంచరికుంట స్లుయిస్ వాల్వ్ నుండి కిషన్ రావు పల్లెకు వెళ్ళే కాలువలో మట్టి పూడిక తీయుటకు రూ" 2.00 లక్షలు, ప్రభుత్వ హాస్పిటల్ గేట్ ఎదురుగా జూనియర్ కాలేజ్ గ్రౌండ్ ముందర స్లాబ్ కల్వర్టు నిర్మించుటకు రూ" 5.00 లక్షలు, రాబోవు బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాట్లు చేయుటకు రూ" 1.00 లక్షలు, హరిత హారంలో భాగంగా మొక్కలను పెంచుటకు పెద్ద సైజ్ బ్యాగ్ లలో మొక్కలను మార్చుటకు రూ" 5.00 లక్షలు, పారిశుధ్య నిర్వహణకు సున్నం కొనుగోలుకు రూ" 1.00 లక్షలు, పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనం రూ" 1000/- చెల్లించుటకు మరియు ఇతర పనులకు సభ్యులు ఆమోదం తెలిపినారు.



ఈ సమావేశంలో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు , చైర్ పర్సన్ అన్నం లావణ్య, వైస్ చైర్మన్ గడ్డమీద పవన్ మున్సిపల్ కమిషనర్ ఎం.డి. అయాజ్, డిప్యూటి ఈఈ అభినయ్, ఏఈ జే. లక్ష్మి టిపిఓ ఏ. ప్రవీణ్, టిపిఎస్ ఆర్. రమ్య, జేఏఓ శివ, మేనేజర్ సిహెచ్. శ్రీనివాస్ ఆర్ఓ బి. తిరుపతి, శానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, వార్డ్ కౌన్సిలర్స్, కో ఆప్షన్-మెంబెర్స్ మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**మహాదేవపూర్ మే 30 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే శ్రీధర్ బాబు జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చౌకిదార్ చౌరస్తాలో కేక్ కట్ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ అక్బర్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, జడ్పిటిసి గుడాల అరుణ, యూత్ అధ్యక్షులు కటకం అశోక్, ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, వార్డ్ మెంబర్ మేసినేని రవిచందర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అశ్రార్ ఖురేషి, భాస్కర వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి హారతి యాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**మహాదేవపూర్ మే 30 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి గుడి ఆవరణలో రాష్ట్ర గోదావరి హారతి యాత్ర కో కన్వీనర్ క్యాతం వెంకటరమణ



ఆధ్వర్యంలో గోదావరి హారతి యాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ.... ఈ యాత్రలో భాగంగా జూన్ 6 తారీఖున కాళేశ్వరం లో గోదావరి హారతి కార్యక్రమం కలదు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బెంబిరి దేవరావు, బిజెపి మండల అధ్యక్షులు శ్రీపురం శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి మంథని రాజేందర్, ఉపాధ్యక్షుడు ఆన్కారి రాజేందర్, బల్ల సంపత్, ఊదరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### వరి ధాన్యం కొనుగోళ్ళను పూర్తి చేయకపోవడం

# ప్రభుత్వ అసమర్ధత

### తెలంగాణ రైతు ఐక్యవేదిక ధ్వజం

**మెటుపల్లి మే 30 (ప్రజామంటలు):** ఖరీఫ్ సీజన్ ప్రారంభ మైనప్పటికీ వరి ధాన్యం కొనుగోళ్ళను పూర్తి చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనమని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి, చెరుకు రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డిలు ఆరోపించారు. మెట్‌పల్లి మండలంలోని వేంపేట, చింతలపేట గ్రామాల్లో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షం కారణంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన వరి ధాన్యాన్ని వారు పరిశీలించారు. తడిసిన వరి ధాన్యాన్ని ఏలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో



రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, సకాలంలో హమాలీలు, గన్ని బ్యాగులతో పాటు లారీలను సకాలంలో సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 5 నుంచి 8 కిలోల వరకు తరుగు పేరిట రైస్ మిల్లర్లు దోచుకుంటున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోని తక్షణమే వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. కొనుగోలు చేసిన వరి ధాన్యం డబ్బులను ఏలాంటి జాప్యం లేకుండా తక్షణమే రైతుల అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్య క్రమంలో రైతు ఐక్యవేదిక నాయకులు గురిజేల రాజరెడ్డి, ముసుకు శంకర్ రెడ్డి, వెలుముల రాజరెడ్డి, అల్లూరి రాజరెడ్డి, మారం పల్లి రఘు, ఎడపల్లి లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్లో శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**కరీంనగర్ మే 30 (ప్రజామంటలు):** కరీంనగర్లో మాజీమంత్రి మంథని శాసన సభ్యులు శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు స్థానిక ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీపాద యువసేన ఫౌండర్ మహదేవపూర్ విజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పోతారం సురేందర్ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతారపు సురేందర్ ఆధ్వర్యంలో మాత శిశు శిశు కేంద్రంలో అల్పాహారం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి అంజన్ కుమార్, మహదేవపూర్ విజయ్ శ్రీనివాస్ రెడ్డి, ఇమ్రాన్, సంతోష్, శ్రవణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో మైనారిటీ యువ నాయకుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## జువ్వాడి నర్సింగరావు మీద దుష్ప్రచారం చేస్తున్నవారిపై సి.ఐ.కి ఫిర్యాదు

**మెట్‌పల్లి మే 30 (ప్రజామంటలు):** కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు మీద దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తుల మీద సిఐ కి ఫిర్యాదు. మాజీ మంత్రి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు ఆశయ సాధకులు అయినా కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు మీద 30 మే 2023 రోజున ముత్యం పేట చక్కెర ఫ్యాక్టరీ ముందర అనుచిత వ్యాఖ్యలు చేసి, దిష్టి బొమ్మ దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఈ దుశ్చర్యకు పాల్పడిన వాళ్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని మెట్ పల్లి లో సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ ఆఫ్ పోలీసు మెట్ పల్లి కి పిర్యాదు చేయడం జరిగింది. జువ్వాడి నర్సింగ రావు పార్టీలు మారుతున్నట్టు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండించారు.




పార్టీలు మారుతున్నట్లు నిరాధార ఆరోపణలు చేసుకుంటూ, జువ్వాడి నర్సింగరావు పేరు ప్రతిష్టలకు భంగం చేస్తున్నారు. అదే విధంగా జువ్వాడి బ్రదర్స్ అనుచరులు, కాంగ్రెస్ నాయకులు అయినా డా. బెజ్జారపు శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం మండల్ కాంగ్రెస్ అద్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డిల పరువుకు భంగం కలిగే విధంగా విష ప్రచారం చేయడాన్ని ఖండిస్తూ, ఇంకో సారి ఈ విధంగా మా నాయకుల మీద ఇంకోసారి విష ప్రచారం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలం కాంగ్రెస్ అద్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి, డా. బెజ్జారపు శ్రీనివాస్, మెట్ పల్లి పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, కోరుట్ల పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్ పాషా, గోనేల రాజేష్, కొండ్ర అరుణ్, గుడ్ల హరీష్, నవీద్, బోడ్ల ఆనంద్, కైతి నిఖిల్, పర్రె కైలాష్, ముద్దం ప్రణయ్, అస్లామ్,బండి వర్శిత్, బాద రాజు, నాగుల దీపక్, గుంజి మహేష్, చౌడాల రవి కాంత్, బర్ల శరత్, నూతన్, ఎడ్ల నవీన్, ముహమ్మద్ నసీర్ లు పాల్గొన్నారు.

## "అల్లె హర్షిత" చిత్రకళ అద్భుతం

### ముగ్దుడైన ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు

**కోరుట్ల టౌన్ మే 30 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణానికి చెందిన అల్లె హర్షిత గీసిన తన చిత్ర పటాన్ని చూసి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ముగ్దులయ్యారు. కోరుట్ల పట్టణానికి చెందిన అల్లె సతీష్ – కావ్యశ్రీ ల కూతురు అల్లె హర్షిత చిత్ర కళ మీద ఉన్న ఆసక్తితో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు చిత్ర పటాన్ని గీసి ఎమ్మెల్యేను కోరుట్ల క్యాంపు కార్యాలయంలో కలిసి తాను గీసిన ఎమ్మెల్యే చిత్రపటాన్ని ఆయనకు బహుకరించారు. ఈ చిత్రాన్ని చూసిన



ఎమ్మెల్యే హర్షితలో అద్భుతమైన ప్రతిభ ఉందని, తగిన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుందన్నారు. ఈ సందర్భంగా హర్షితను అభినందించిన ఆయన శాలువాతో సన్మానించారు. ఇంత చిన్న వయస్సులో అద్భుత ప్రతిభ చూపిన హర్షితను బిఆర్ఎస్ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

గొప్ప ఆర్టిస్టుగా జాతీయ స్థాయి గుర్తింపు పొందడమే తన ధ్యేయమని ఈ సందర్భంగా హర్షిత తన ఆకాంక్షను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకటరావు, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్రశేఖర్, నాయకులు గుడ్ల మనోహర్, జిందం లక్ష్మి నారాయణ, ఆయా గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.



### సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో

# పవర్ గ్రిడ్ శానిటేషన్ డ్రైవ్

### స్వచ్ఛ్ తా పక్వాడా 2023 ఉత్సవాలు


**సికింద్రాబాద్ మే 30 (ప్రజామంటలు):** పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్-1 ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్వచ్ఛ్ తా పక్వాడా-2023 కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ శ్రీవాస్తవ, స్టేషన్ మేనేజర్ రాజనర్సు, చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్.ఆర్) పీకే హరినారాయణన్, సీనియర్ అధికారులు, సిబ్బందితో కలసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ్ తా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించి, శుభ్రం చేశారు. మే 16 నుంచి 31 వరకు స్వచ్ఛ్ తా పక్వాడా -2023ను నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. స్వచ్ఛ్ తా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు గాను రైల్వే స్టేషన్‌లో ప్లాట్ పారమ్ నెం.1 లో వీధి నాటకాన్ని ప్రదర్శించారు. పరిసరాల శుభ్రత పాటిస్తామని పవర్ గ్రిడ్ ఎంప్లాయిస్ ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందచేశారు. ప్లాస్టిక్ బ్యాగుల స్థానంలో కాటన్ బ్యాగులను వాడాలని చెబుతూ, స్ట్రీట్ వెండర్స్ కు కాటన్ బ్యాగులను పంపిణీ చేశారు.

## తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చెయ్యాలి

### ధర్మారం రహదారిపై రైతుల రాస్తారోకో

### స్తంభించిన ట్రాఫిక్

**గొల్లపల్లి మే 30 (ప్రజామంటలు):** అకాల వర్షం, వడగళ్ల వానలతో తడిసిన వరి ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయా లని, రైతులు పోసుకున్న ధాన్యం కుప్పలు వరదకు కొట్టుకు పోయాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లపల్లి మండలం కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యంను బేషరతుగా తరుగు లేకుండా కొనుగోలు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జగిత్యాల-ధర్మారం రహదారిపై రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తారోకో చేశారు. మండలంలో సోమవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి రైతులు పోసుకున్న ధాన్యం కుప్పలు వరదకు కొట్టుకు పోయాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంట వేసిన ధాన్యమును తరలించ డానికి లారీలు రావడం లేదు అని, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యమును వేగంగా కొనుగోలు చేయక రైతులను తీవ్రమైన ఇబ్బందులకు గురిచెస్తున్నారని రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసి మొలకలు వచ్చిన ధాన్యమును రోడ్డుపై పోసి రైతులు రాస్తారోకోకు దిగారు. తడిసిన ధాన్యమును బేషరతుగా తరుగు లేకుండా కొనుగోలు చేస్తామని ఉన్నతాధి కారులు



వచ్చి హామీ ఇచ్చేంత వరకు రాస్తా రోకో విరమించేది లేదని రైతులు మొండి కేశారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. తడిసిన ధాన్యముపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి కొనుగోలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి కరుణ, స్థానిక ఎస్సై దత్తాద్రి హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి తమ ఆందో ళన విరమించారు.

# కల్తీ లావా (కవిత)

కల్తీ లావా ప్రవహిస్తోంది,
నిశ్శబ్ద ప్రళయభయంకరంగా!
ధ్వని లేకుండా దహించేస్తోంది!
భవిష్యత్తులను అమాంతం మింగేస్తోంది!

పాల పేరు ద్రావణాన్ని తాగే పసిపాపలు,
పాకెట్ల చిరుతిళ్ళ, పాపం తెలియని చిన్నారులు!
పాచి వేయింపులకు రుచి మరిగిన యువత!
కాయగూరల్లో గూడా హాలాహలమని తెలియని మనం!

గేదెల్లేవ్, పాడి లేదు, గానీ,
లక్షల జనాలకు కోట్లల్లో పాలపాకెట్లు!!
పసికూనల బొజ్జల్లో నిండుతున్న విషాలు!!

నవ్వేటి నవ్వుల్లో కన్పించే కల్తీ!
మాట్లాడే మాటల్లో విన్పించే కల్తీ!
కూరగాయల నిగనిగల్లో కల్తీ!
వంటనూనెల ఘుమ ఘుమల్లో కల్తీ!
పంట పండించే విత్తనాల్లో కల్తీ!

తాగేటి, వండేటి నీరు కల్తీ!
వీచేటి, పీల్చేటి గాలి కల్తీ!
పండించి, తింటున్న తిండి కల్తీ!
రోగాన్ని తగ్గించు మందులూ కల్తీ!!

కల్తీ లావాను ఆర్పేది ఎవరు?
కార్చిచ్చు కల్తీని చల్లార్చునదెవరు?
తీరిక దొరకని పరిపాలనలో,
కల్తీ నివారణ అసాధ్యమా??
ప్రాణాలు బలియైన తరుణాలు ఎన్ని?
మరణాలు తగ్గించు, మంచి పరిణామమెపుడు??
రచన:



– జగదీశ్వరి, జనగామ

## చంద్రబాబుకు అంత సెక్యూరిటీ ఎందుకో

**వారిని తొలగిస్తే బాబు పని అయిపోయినట్లే**

**బాబు కాలు కూడా ఇక బయట పెట్టలేడు**

**సెక్యూరిటీ తొలగించాలని కేంద్రాన్ని కోరుతా**

**ఆముదాలవలస బైక్ ర్యాలీలో స్పీకర్ తమ్మినేని**

**శ్రీకాకుళం,మే30 (ప్రజామంటలు):** టీడీపీ అధినేత, ప్రతిపక్షనాయకుడు నారా చంద్రబాబుకు ఎందుకు బ్లాక్ డ్రెస్ కమాండర్లు అంటూ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశ్నించారు. ఈ సెక్యూరిటీని తొలగించాలని స్పీకర్ గా కేంద్ర ప్రభుత్వానికి అప్పీల్ చేస్తానని స్పష్టం చేశారు. చాలా మంది నేతలకు హెచ్చరికలు ఉన్నాయని అయినా ఈయనకే ఎందుకు జడ్ ప్లస్ కేటగిరిని కేంద్ర ప్రభుత్వం కేటాయించిందో చెప్పాలన్నారు.



హెచ్చరికలు ఉన్న నేతలందరికి సెక్యూటరీ ఇస్తారా అని ప్రశ్నించారు. దీనిపై పునరాలోచించాలని స్పీకర్ కోరారు. సెక్యూరిటీ లేకుంటే చంద్రబాబు ఎక్కడికీ కదలేరని విమర్శించారు. వారిని చూసే హంగామా చేస్తుంటారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బడుగు, బలహీన వర్గాల పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపైన చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆమదాలవలసలో వైసీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాం చంద్రబాబుపై సంచలన కామెంట్స్ చేశారు. ముందు దివంగత నేత మాజ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి తమ్మినేని సీతారం నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ.. చంద్రబాబు మహానాడులో లేనిపోనీ హామీలు గుప్పించి మరోసారి ప్రజలను మోసాం చేసేందుకు సిద్ధ పడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబునాయుడుపై పరుష పదజాలాలతో మండిపడ్డారు. అసలు ఆయనకు సెక్యూరిటీ లేకపోతే బయటకు రాలేరని.. ఆయన ఫినిష్ అయిపోతారని కామెంట్ చేశారు. ఆయన పాలనపై తూర్పార బట్టారు. ఎన్టీఆర్ ను అధికారం నుంచి దించి వెన్నుపోటు పొడిచారన్నారు. ఆరోజు చంద్రబాబు నాయుడు మాయలో తానూ పడ్డానని, దీంట్లో నేను భాగస్వామినని వ్యాఖ్యనించారు. అధికారంలో ఉండేటపుడు హామీలను నేరవేర్చడంలో విఫలమైన బాబును ప్రజలు గద్దె దించాశారని తెలుసుకోవాలన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి మేనిపేస్టోను కాదు అందులో ఇవ్వని హామీలు నెరవేర్చి ప్రజల మనసుల్లో సీఎం జగన్ స్థానం సంపాధించుకున్నారన్నారు. సీఎం జగన్ మేనిఫెస్టోను దైవంగా భావిస్తారని వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికే 98.7 శాతం అమలు చేశారని చెప్పారు.హామీ ఇవ్వని ఎన్నో అంశాలను సైతం పరిష్కరించారని పేర్కొన్నారు తమ్మినేని. సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా ఏపీ నిలిచిందని, పెన్షన్ల పెంపు మొదలుకొని, లక్షల ఉద్యోగాల కల్పన, రైతు భరోసా, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, నాడు – నేడు,విప్లవాత్మక మార్పులతో ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ వాహన మిత్ర, చేయూత, మత్స్యకార భరోసా, కాపు నేస్తం లాంటి ఎన్నో కార్యక్రమాలు లక్షల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. కులం, పార్టీ, ప్రాంతం చూడకుండా నవరత్నాలు పేరుతో పేదలందరికీ ఇళ్లు అందజేసి దేశవ్యాప్తంగా సీఎం మన్ననలు పొందారని చెప్పారు. సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు గ్రామ స్వరాజ్యానికి నాంది పలికాయన్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ వైసీపీ అఖండ విజయం సాధించడం ప్రభుత్వం పట్ల ప్రజలకున్న గట్టి నమ్మకాన్ని తెలియజేసినట్లు అయిందని తమ్మినేని సీతారం అన్నారు. పాదయాత్ర సందర్భంగా ప్రత్యేకించి ఉత్తరాంధ్ర కష్టాలను చూసిన జగన్.. మాట ఇచ్చిన విధంగానే అభివృద్ధికి కట్టుబడ్డారని చెప్పారు. నవరత్నాలు, పేదలందరికీ ఇల్లు, డాక్టర్ వైఎస్ఆర్ జగనన్న భూమి హక్కు–భూ రక్షపథకం (రీ సర్వే) వంటి నిర్ణయాలు చారిత్రాత్మకమైన అంశాలుగా స్పీకర్ తమ్మినేని అభివర్ణించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని సీతారాం పేర్కొన్నారు. అర్హులైన వారికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. నిరుపేదల గౌరవాన్ని పెంచేలా జగన్ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆలోచన, ఆశయానికి ప్రతిరూపంగా ఉన్న గడపగడపకు మన ప్రభుత్వ లక్ష్యం ఉద్దేశ్యం గొప్పదన్నారు. ఐదు సంవత్సరాల తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. రాష్ట్రంలో సుమారు 33 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే వాటిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష నాయకుడు, సెంటు స్థలంలో శవాలు పూడ్చుకోవడానికి తప్ప ఎందుకు సరిపోతుంది అనే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజమండ్రి మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో చూస్తుంటే ప్రజలందరూ నవ్వుకుంటున్నారని చెప్పుకొచ్చారు. వైసీపీ పథకాలను కాపీ కొట్టారని, అయినా తెలుగు దేశం పార్టీనీ వారి ఇచ్చే హామీలను ప్రజల నమ్మరని అన్నారు. రాబోయే ఎన్నికలు పేదవాడికి పెత్తందారులకి మధ్య జరిగే యుద్ధమని తెలిపారు.

# కలిసి పని చేద్దాం రెడ్ క్రాస్ సొసైటీనీ అభివృద్ధి చేద్దాం

**– కలెక్టర్ శివలింగయ్య**




**జనగామ మే 30 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వితీయ మేనేజింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయం అనీ అందరం కలిసి పని చేసి అభివృద్ధి చెద్దామని జనగామ జిల్లా కలెక్టర్ శివలింగయ్య అన్నారు. ఈనెల 26న నూతన మేనేజింగ్ కమిటి ఎన్నిక కావడం మంగళవారం మేనేజింగ్ కమిటి తొలి సమావేశం ముగిసిన అనంతరం కమిటీ సభ్యులుజిల్లా కలెక్టర్ ను లాంఛనంగా కలిసి ప్రెసిడెంట్ గా ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. కార్యాలయం ఏర్పాటు చేసుకొని పనులు రారంభించాలని సూచిస్తూ తన వంతు సహకారం అందిస్తానని హామి ఇచ్చారు. ఎన్నికల అధికారి గా వ్యవహరించిన జిల్లా సహకార శాఖాధికారి కిరణ్ కుమార్ రెడ్ క్రాస్ సొసైటీ కొత్త మేనేజింగ్ కమిటీ సభ్యులను పరిచయము చేసారు. వివిధ సందర్భాల్లో కలెక్టర్ కలిసినవారే కనుక అందరినీ పేరు పేరు న కలెక్టర్ అభినందించారు. ఛైర్మెన్ డా. డి. లవకుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ పి. గోపయ్య, కార్యదర్శి కన్న పరశురాములు, కోశాధికారి కుర్రెంల యాదగిరి, స్టేట్ ఎం. సి. మెంబర్ మహమ్మద్ గౌస్ మోహియుద్దీన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు సి. ఉపేందర్ రెడ్డి, డా. పి. సత్యం, పి. ప్రభాకర్, క్రిష్ణ జీవన్ బజాజ్ , గాదె క్యాథరిన్, బి. రజినీ తదితరులు కలెక్టర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

**31 యూనిట్ల రక్తదానం సేకరణ:**

జిల్లా ఆసుపత్రి, ఎం సి హెచ్ ఆసుపత్రులలో రక్తం అవసరం అనివార్యమైన పరిస్థితిలో ఉందని అధికారులు కోరిన మేరకు ఈ రోజు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి శిబిరంలో 31 యూనిట్ల రక్త దానం సేకరించారు. తొలుత కమిటీ సభ్యులు కుర్రేముల యాదగిరి, క్రిష్ణ జీవన్ బజాజ్, లయన్ శ్యామ్ సుందర్ లు రక్తదానం తో ప్రారంభమైన ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. సుగునాకర్ రాజు మాట్లాడుతూ జిల్లాలో అవసరానికి తగిన రక్తం సేకరణలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఆరోగ్య శిబిరాలు ఇతర కార్యక్రమాల నిర్వహణ లో తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డా. ఎస్. రామనర్సయ్య తో కలిసి రక్త దాతలకు ధృవ పత్రాలు ప్రదానం చేసారు. ఈ రోజు స్వచ్ఛందంగా రక్త దానం చేసిన మహిళలు ఏర్రగొల్లపహడ్ గ్రామానికి చెందిన విజయశ్రీ, ఉపాధ్యాయురాలు కె. సునంద ల సేవానిరతిని రెడ్ క్రాస్ చైర్మన్ డా. లవకుమార్ రెడ్డి కొనియాడారు. రక్తదానం చేయడం వల్ల లాభాలే తప్ప నష్టాలు ఉండవని వైద్యులు అన్నారు.




**ప్రతి నెల ఒక రక్త దాన శిబిరం:**

**మేనేజింగ్ కమిటీ తొలి సమావేశంలో నిర్ణయం**

ఇకనుండి ప్రతి నెల ఒక రక్త దాన శిబిరం నిర్వహించుటకు రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా శాఖ మేనేజ్మెంట్ కమిటి సమావేశంలో నిర్ణయించారు. ఈ రోజు ఉదయం చైర్మన్ డా. లవకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు గైకొన్నారు. త్వరలో యువకుల సమ్మేళనం నిర్వహించి గుండె పోటు నరికట్టే సి పి ఆర్ ఐ కార్యక్రమం నిర్వహించాలని, తొలి త్రైమాసికంలో కనీసం మూడు వందల మంది సభ్యులను చేర్పించాలని, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డా. యస్. రాంనర్సయ్య ను కార్యవర్గంలో సభ్యునిగా తీసుకొని వారి సేవలను పొందుటకు నిర్ణయాలు గైకొన్నట్లు సొసైటీ చైర్మెన్ డా. లవకుమార్ రెడ్డి తెలిపారు.

## జగిత్యాల జిల్లా నీటి పారుదల శాఖలో

# టీఎన్జీవోల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం

**జగిత్యాల మే 30 (ప్రజామంటలు):** టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మామిళ్ల రాజేందర్ మరియు ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ గారి ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈనాటి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జగిత్యాల జిల్లా నీటి పారుదల శాఖ ఉద్యోగులు పాల్గొని టిఎన్జీవో జగిత్యాల జిల్లా సంఘం యొక్క సభ్యత్వం తీసుకోవడం జరిగినది.

ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్ మాట్లాడుతూ.... టీఎన్జీవోల సంఘం ఎప్పుడు ఉద్యోగుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నదని పెండింగ్ డీఏలు, నూతన పిఆర్సి, సాధారణ బదిలీలు, సిపిఎస్ రద్దు వంటి అంశాలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టిపిఎ మామిడి రమేష్, నీటి పారుదల శాఖ ఫోరం అధ్యక్షులు కె.విజయ్ కుమార్, కార్యదర్శి సల్వాజి శ్రీనివాస్, ప్రసాద్, టిఎన్జీవో నాయకులు షాహిద్ బాబా, రాములు, హకీం, మధుకర్, ఉద్యోగులు నగేష్, శ్రీనివాస్, ముబీన్, అజీం, శ్రీనివాస్, రమేష్, సునీత, సంధ్య, సుజాత ఉద్యోగులు పాల్గొన్నారు.



## అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రు.10,000 ఆర్థిక సాయం, ఎన్జీఓ సభ్యులు మరో రు.10,000ల ఆర్థిక సాయం

**బీర్పూర్ మే 30 (ప్రజామంటలు):** మండలంలోని అచునురి తండాలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో ఆదివాసుల ఇళ్లు కాలిపోగా, మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్ రెడ్డి అగ్నిప్రమాదం లో కాలిపోయిన ఇళ్ల స్థలాలను స్థానిక ఎం పీపీ మసర్థి రమేష్, కాంగ్రెస్ మండల అద్యక్షుడు సుభాష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాద సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కౌలుకు తీసుకొని, పత్తి సాగు చేసుకున్నామని, ఇంట్లో నిల్వ చేసిన పత్తితోపాటు రు.4.50 లక్షలు డబ్బులు సైతం కాలి బూడిద అయ్యాయని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఎదుట బోరున విలపించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి బాధిత కుటుంబానికి రు.10,000 నగదు ఆర్థిక సాయం అందించారు. కొలుముల దామోదర్ యాదవ్ కెనడా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ అధ్వర్యంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ద్వారా మరో రు.10,000 ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వెంట ఎంపీపీ మసర్తి రమేష్, కాంగ్రెస్ మండల అద్యక్షుడు సుభాష్ యాదవ్, సర్పంచ్ జితేందర్, సింగిల్ విండో చైర్మన్ నవీన్ రావు, ఎంపిటిసీ రంగు లక్ష్మణ్, ఆడేపు మల్లేశ్వరి తిరుపతి, వెయ్య కిరణ్, పాల్గొన్నారు.



# లవ్ జిహాద్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**బిజెపి రాష్ట్ర నాయకుడు ముదిగంటి రవీందర్ రెడ్డి**

**జగిత్యాల మే 30 (ప్రజామంటలు):** ప్రేమ పేరుతో హిందూ అమ్మాయిలను వలలో వేసుకొని మతం మార్చే కుట్రలకు పాల్పడుతున్న లవ్ జిహాద్ పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని బిజెపి రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్ రెడ్డి అన్నారు.బీజేపీ నేత ముదిగంటి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేరళ స్టోరీ సినిమా ను మంగళవారం స్థానిక దుర్గరాజ కళామందిర్ లో ఉచితంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ లవ్ జిహాద్ పేరుతో వందలాదిమంది హిందూ అమ్మాయిలను ప్రేమ పేరుతో వలలో వేసుకొని, మతం మార్చి వారిని విదేశాలకు విక్రయించి భారతదేశ వ్యతిరేకులుగా మార్చుతున్నారని తెలిపారు. కేరళలో జరిగిన నిజమైన సంఘటనల ఆధారంగా నిర్మించిన కేరళ స్టోరీ సినిమాను ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సినిమా ప్రదర్శనకు పెద్ద ఎత్తున



మహిళలు తరలిరాగా వారికి కాషాయ కండువాలతో స్వాగతం పలికారు. అనంతరం లవ్ జిహాద్‌కు గురి కాకుండా హిందూ సమాజాన్ని కాపాడుకుంటా మని ప్రతిజ్ఞ చేయించారు.

**బుధవారం కూడా ఉచిత ప్రదర్శన...**

కేరళ స్టోరీ సినిమాను తిలకించేందుకు మంగళవారం పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారని, ప్రేక్షకుల నుండి వస్తున్న విశేష స్పందన దృష్ట్యా బుధ వారం మధ్యాహ్నం రెండు గంటలకు మరో మారు ఉచితంగా కేరళ స్టోరీ సినిమాను ప్రదర్శించనున్నట్లు బిజెపి నేత రవీందర్ రెడ్డి తెలిపారు.

## బాలయ్య మూవీ టైటిల్ మోనార్క్?

నందమూరి బాలకృష్ణ హీరోగా, టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఒక మాస్ ఎంటర్‌టైనర్ మూవీని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. వీరసింహా రెడ్డి వంటి సూపర్ హిట్ తరువాత బాలయ్య నుండి వస్తున్న సినిమా కావడంతో



అంచనాలు కూడా భారీగానే నెలకొన్నాయి. ఈ సినిమలో టాలీవుడ్ లేటెస్ట్ బ్యూటీ సెన్సేషన్ శ్రీలీల బాలకృష్ణ కూతురి పాత్రలో కనిపించనుంది. కూతురంటే సొంత కూతురు కాదు.. బాలకృష్ణ అన్న కూతురు. అయితే శ్రీలీలకు నాన్నగా చేస్తుంది ఎవరు అనేది ఇప్పటికైతే సస్పెన్సే. ఎన్‌బికె108 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ఒక న్యూస్ సోషల్ మీడియా వైరల్ అవుతోంది. అదేంటంటే.. ఈ సినిమా కోసం ముందుగా 'బ్రో..ఐ డోంట్ కేర్' అనే టైటిల్ ను పరిశీలించారట మేకర్స్. అయితే 'బ్రో' టైటిల్ ను పవన్ సినిమా కోసం వాడేస్తుండటంతో.. ప్రస్తుతం ఈ సినిమాకు మోనార్క్ అనే టైటిల్ ఫిక్స్ చేసే ఆలోచనలో టీం ఉన్నట్లు సమాచారం.

ఈ టైటిల్ అయితే బాలయ్య బాడీ లాంగ్వేజ్ కు పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుదని టీం భావిస్తున్నారట. ఆల్మోస్ట్ ఇదే టైటిల్ ఫిక్స్ అయ్యే చాన్సేస్ కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే ఈ టైటిల్ పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పక్క మాస్ అండ్ రివెంజ్ డ్రామాతో రానున్న ఈ సినిమాకి టాలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ తమన్ సంగీతం అందిస్తున్నాడు. మరి విడుదల తరువాత ఈ సినిమా ఎన్ని కొత్త రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో తెలియాలంటే దసరా వరకు ఆగాల్సిందే.

# నా గర్ల్‌ఫ్రెండ్ పేరు కూడా శృతినే

## బన్నీ ఫన్నీ కామెంట్స్



పుష్ప' సక్సెస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా క్రేజ్ సంపాదించుకున్నారు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. ప్రస్తుతం ఆ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కుతున్న 'పుష్ప-2' చిత్రంతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాన్ని చెప్పుకొచ్చారు. 'ఆహా' ఓటీటీలో జరుగుతున్న తెలుగు ఇండియన్ ఐడల్ గ్రాండ్ ఫినాలే కార్యక్రమానికి అల్లు అర్జున్ అతిథిగా హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో శ్రుతీ నండూరి పాడిన పాటలను ఆస్వాదించిన బన్నీ ఆమె పేరుకు, తన వ్యక్తిగత జీవితానికి సంబంధముందన్నారు. తన ఫస్ట్ గర్ల్‌ఫ్రెండ్ పేరు శ్రుతీ అని వెల్లడించారు. సింగర్ శ్రుతి పాట పాడిన అనంతరం బన్నీ మాట్లాడుతూ.. 'నీ పేరు అంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే నా ఫస్ట్ గర్ల్‌ఫ్రెండ్ పేరు కూడా శ్రుతినే' అంటూ సరదాగా చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రోమో నెట్టింట వైరల్‌గా మారింది. 'మిమ్మల్ని, మీ భార్య స్నేహాని, పిల్లల్ని చూస్తే ముచ్చటేస్తుంది. మీ మధ్య మంచి బాండింగ్ ఉంది. మీ ఫ్యామిలీని చూసి చాలా నేర్చుకోవాలి' అని సింగర్ గీతామాధురి అనగా, ఈ శ్రుతీ ఎపిసోడ్ తర్వాత కూడా బాండింగ్ అలాగే ఉండాలని కోరుకుంటున్నా' అని బన్నీ చమత్కరించారు. మరి ఈ వీడియో చూసి స్నేహా ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి. అలాగే తన తండ్రి గురించి గొప్పగా మాట్లాడారు బన్నీ. ఒక్క మాటలో తన తండ్రి గురించి చెప్పాలంటే 'నాకు దేవుడు ఎలా ఉంటాడో తెలీదు కానీ.. నాకు కనిపిస్తూ, అన్ని ఇచ్చిన దేవుడు మా నాన్న' అని చెప్పుకొచ్చారు.

## గ్రామీణ రాజకీయ నేపథ్యంలో మరో సినిమా



పదిహేనేళ్ల క్రితం వచ్చిన 'కొత్త బంగారు లోకం' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యాడు శ్రీకాంత్ అడ్డాల. తొలి సినిమానే శ్రీకాంత్ అడ్డాలకు తిరుగులేని క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆ తర్వాత ఏకంగా మహేష్, వెంకటేశ్‌లను పెట్టి 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' అనే క్లాస్సీ మల్టీస్టారర్ తెరకెక్కించాడు. ఈ సినిమా వసూళ్లు అప్పట్లో సంచలనమే రేపాయి. ఎలాంటి కమర్షియల్ హంగులు లేకుండా కేవలం కుటుంబ నేపథ్యంతో సినిమా తీసి కోట్లు కొల్లగొట్టిన ఘనత శ్రీకాంత్ అడ్డాలకే చెందుతుంది. శ్రీకాంత్‌కు ఈ సినిమా తెచ్చిన క్రేజ్ అంతా ఇంతా కాదు. ఈ సినిమా తర్వాత మెగా ప్రిన్స్‌ను ఇంట్రడ్యూస్ చేస్తూ 'ముకుందా' తీశాడు. కమర్షియల్‌గా ఈ సినిమా అంతగా ఆడకపోయినా.. విమర్శకుల మెప్పు పొందింది.రెండేళ్ల తర్వాత మళ్లీ మహేష్‌తో 'బ్రహ్మోత్సవం' సినిమా తీశాడు. ఏడు తరాలు వెనక్కి వెళ్లాలనే కాన్సెప్ట్ తో చేసిన ఈ సినిమా పెద్దగా వర్కౌట్ కాలేదు. బాక్సాఫీస్ దగ్గర ఘోర పరాజయం చూసింది. దాంతో ఐదేళ్ల వరకు మరో సినిమా చేయలేదు. ఇక చివరగా వెంకటేష్‌తో 'అసురన్' రీమేక్ చేశాడు. 'నారప్ప' పేరుతో తెరకెక్కిన ఈ సినిమా నేరుగా ఓటీటీలో విడుదలై మంచి ఆదరణ దక్కించుకుంది. సెన్సిబుల్ దర్శకుడిగా పేరున్న శ్రీకాంత్ అడ్డాల మాస్ స్జబెక్ట్‌ను కూడా డీల్ చేయడంలోనూ దిట్ట అని నిరూపించాడు. ఇక ఈ సినిమా తర్వాత మళ్లీ శ్రీకాంత్ అడ్డాల మరో సినిమా చేయలేదు. కాగా తాజాగా శ్రీకాంత్ అడ్డాల తన కొత్త సి ని వ మా న ం ప్రకటించాడు. ద్వారక క్రియేషన్స్ పతాకంలో ఓ రా రస్టిక్ సినిమాను చేస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన బిగ్ అప్‌డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను జూన్ 2న రివీల్ చేయబోతున్నట్లు ప్రకటించాడు. అయితే హీరో గురించి ఏమి రివీల్ చేయలేదు. కాగా ఈ సినిమాతో మిర్యాల రవిందర్ రెడ్డి మేనల్లుడు హీరోగా పరిచయం కాబోతున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా 1980 బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కుతుంది తెలుస్తుంది. ఆ టైమ్‌లో కోనసీమలో రాజకీయాలు, అక్కడ వర్గ పోరాటాలు, కులాల ఆధిపత్యాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని, కాస్త రా కంటెంట్‌తోనే శ్రీకాంత్ అడ్డాల ఈ సినిమాని తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తుంది. దీనిపై క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## ఆదిపురుష్ గీతాలకు భారీగా వ్యూస్

రామాయణ గాథ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'ఆదిపురుష్'. ప్రభాస్ రాముడిగా, కృతిసనన్ సీతగా కనిపించనున్నారు. ఓం రౌత్ దర్శకుడు. సైఫ్ అలీఖాన్, సన్నీసింగ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూన్ 16న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

ఈలోగా ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేశారు. టీజర్, ట్రైలర్ ఇప్పటికే విడుదలయ్యాయి. ఇప్పుడు పాటలు సందడి చేస్తున్నాయి. 'శ్రీరామ్' అంటూ సాగే గీతాన్ని ఇటీవల విడుదల చేశారు. ఇప్పుడు 'రామ్ సీతారామ్' అనే పాటని



ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. దీనికి లక్షలాదిగా వ్యూ వస్తున్నాయి. సీతారాముల ఔన్నత్యాన్ని, వారి విశిష్టతనూ, ఆ ఇద్దరి ప్రేమలోని గాఢతని తెలిపే గీతమిది. రామజోగయ్య శాస్త్రి రచించారు. సచేత్ - పరంపర స్వర పరిచారు. జూన్ మొదటి వారంలో తిరుపతిలో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించనున్నారు.

## ఆ టెడ్డీ..ఈ టెడ్డీ ఒకటేనా?

మెగా హీరో అల్లు శిరీష్ హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ టెడ్డీ. ఈ సినిమా అఫీషియల్ అనౌన్స్మెంట్ మే 30న రానుంది. దీనికి సంబంధించిన ప్రీ లుక్ ను కూడా రిలీజ్ చేశారు మేకర్స్. అయితే ఈ ప్రీ లుక్ చూసిన చాలా మంది.. ఈ పోస్టర్ ను ఇంతకుముందే వచ్చిన రెండు సినిమాలతో పోలిస్తున్నారు. అందులో ఒకటి తమిళ




హీరో ఆర్య, సాయేషా సైగల్ జంటగా వచ్చిన టెడ్డీ మూవీ. ఇదొక సూపర్ నాచురల్ మూవీ. ఈ మూవీలో కోమాలో ఉన్న హీరోయిన్ ఆత్మ ఒక టెడ్డీ బియర్ లోకి ప్రవేశించి హీరో ద్వారా తన ప్రాణాలను ఎలా కాపాడుకుంటుంది అనేది చూపించాడు. ఈ సినిమా ఇప్పటికే ఓటీటీలో అందుబాటులో ఉంది.

ఇక రెండవది సందీప కిషన్ హీరోగా నెట్ ఫ్లిక్స్ అనౌన్స్ చేసిన బడ్డీ మూవీ. 2023 సంక్రాంతి సందర్భంగా నెట్‌ఫ్లిక్స్ తమ కంటెంట్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. అందులో సందీప్ కిషన్ హీరోగా 'బడ్డీ' సినిమాను ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ ను కూడా రిలీజ్ చేసింది. మైఖేల్ మూవీ తరువాత బడ్డీ సినిమా వస్తుందని అందరూ అనుకున్నారు. కానీ ఏమైందో తెలీదు కానీ ఆ సినిమా ఆగిపోయిందని సమాచారం. ఇప్పుడు అదే సినిమాను అల్లు శిరీష్ తో తీస్తున్నారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. మరి ఈ సినిమా ఆర్య హీరోగా వచ్చిన సినిమాకి రీమేక్ గా వస్తుందా.. లేక కొత్త కాన్సెప్ట్ తీసుకుంటున్నారా అనేది తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా అల్లు శిరీష్ టెడ్డీ మూవీ ఫస్ట్ లుక్ చాలా మంది ఇది ఖచ్చితంగా తమిళ టెడ్డీ మూవీకి రిమేకే అని కామెంట్స్ చేస్తున్నారు. మరి ఇది రీమేకా లేక కొత్త కథానా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# భోళాశంకర్ లుక్స్ అదుర్స్

మెగాస్టార్ చిరంజీవి కాంపౌండ్ నుంచి వస్తున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ భోళా శంకర్. బ్లాక్ బ్లాస్టర్ మూవీ వేదాళమ్ రీమేక్‌గా తెరకెక్కుతుంది. మెహర్ రమేశ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో మిల్కీ బ్యూటీ తమన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా..కీర్తిసురేశ్ చిరంజీవి సోదరి పాత్రలో మెరువనుంది. ఇప్పటికే విడుదల చేసిన లుక్ ఒకటి ఆన్‌లైన్‌లో హల్ చల్ చేస్తోంది. తాజాగా మేకర్స్ క్రేజీ లుక్‌తో నయా వార్త అందించారు.

గెట్ రెడీ.. భోళా మ్యూజికల్ మేనియా త్వరలోనే షురూ కానుంది. మహతి స్వరసాగర్ థంపింగ్ మ్యూజికల్ ట్రీట్ కోసం వేచి ఉండండి.. సాంగ్ స్టిల్ ఒకటి షేర్ చేశారు. మెగాస్టార్ స్టైలిష్ లుక్ ఇప్పుడు నెట్టింట్లో ట్రెండింగ్ అవుతోంది. భోళా శంకర్ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, క్రియేటివ్ కమర్షియల్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. మహతి స్వరసాగర్ సంగీతం అందిస్తునన్నాడు. ఈ మూవీలో మురళీ శర్మ, రఘుబాబు, రావు రమేశ్, వెన్నెల కిశోర్, పీ రవి శంకర్, ప్రగతి, శ్రీముఖి, బిత్తిరి సత్తి, రష్మీ గౌతమ్, ఉత్తేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 11న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్.



PRINTED AND PUBLISHED BY VNARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO , RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com